మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట





ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: జిల్లా ఎస్పీ

**నారాయణపేట టౌన్, నవంబరు 18 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ బాధితుల నుండి 05 ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిశీలించవలసిందిగా సిఐ ,ఎస్సైలకు సూచించారు. 02 ఫిర్యాదులు ఫ్యామిలీ గొడవలకు సంబంధించినవి కాగా, 03 భూతగాదాలకు సంబంధించి ఫిర్యాదులు రావడం జరిగింది. భూ తగాదాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని లేదా సామరస్యంగా మాట్లాడుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని, ఏలాంటి ఆవేశాలకు లోను కారాదన్నారు. ఫిర్యాదుదారులకు ఎస్పీ సూచించారు. బాధితులు తీసుకొచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్లో ఉంచరాదని వాటిని వెంటనే చట్ట ప్రకారం పరిష్కరించాలని ఫోన్లో మాట్లాడి సంబంధిత అధికారులకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని, పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగుతున్నందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి కావున ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

## గ్రూప్-3 పరీక్ష కేంద్రం ఆకస్మిక తనిఖీ

### నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబరు 18 ప్రభాతవార్త:** టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పగడ్బందీగా నిర్వహించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. టిజిపిఎస్సి నిబంధనలు ప్రకారం పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్ అనుమతి లేని కారణంగా నిబంధనలు పాటిస్తూ, పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకురావద్దన్న ఆదేశాలను ఆయన అనుసరించారు. తన సెల్ ఫోన్‌ను వాహనంలోనే వదిలి వెళ్లి పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు, పర్యవేక్షణ, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. రెండవ రోజు సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా పట్టణంలోని సైన్స్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న గ్రూప్-3 పరీక్ష కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్షా సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్ష పూర్తి అయ్యే వరకు అభ్యర్థులను బయటికి పంపొద్దని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరాటంకంగా సరఫరా చేస్తున్నామని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు అన్ని కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సురక్షిత మంచినీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్ 3

### పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో,నవంబరు 18, ప్రభాతవార్త :** రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించిన గ్రూప్3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రంలోని ఎన్.టి.ఆర్ కాలేజి, క్రీస్తు జ్యోతి విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ విజయేందిర బోయి సోమవారం తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది పరిశీలించి పలు సూచనలు చేశారు. కాగా, కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ సాఫీగా పరీక్షలు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.




పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం

### జడ్చర్ల నూతన చైర్మన్ గా కోనేటి పుష్పలత

**జడ్చర్ల,నవంబరు 18 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ నూతన చైర్ పర్సన్ గా కోనేటి పుష్పలత సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో మున్సిపల్ చైర్ పర్సన్ గా ఉన్నదోరేపల్లి లక్ష్మిపై సొంత పార్టీ బిఆర్ఎస్ కౌన్సిలర్ లు అవిశ్వాస తీర్మానం పెట్టడంతో అవిశ్వాసం నెగ్గిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆమె చైర్మన్ పదవి కోల్పోయారు. దీంతో నూతన చైర్పర్సన్ ఎన్నిక అనివార్యం కావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు సోమవారం ఎన్నికకు తేదీ ఖరారు చేయగా ఒకరోజు ముందుగానే క్యాంపునకు తరలిన సుమారు 18 మంది కౌన్సిలర్లు మాజీ మంత్రి ల'క్ష్మారెడ్డి సలహా మేరకు ఏకాభిప్రాయ నిర్ణయానికి వచ్చారు. కోనేటి పుష్పలతకు వ్యతిరేకంగా ఎవరు కూడా నామినేషన్ దాఖలు చేయకపోవడంతో 14వ వార్డు కౌన్సిలర్ కోనేటి పుష్పలత సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ బిజెపి కౌన్సిలర్లు హాజరైన వారి పాత్ర నామమాత్రంగానే మిగిలింది. చైర్మన్ పదవి కోల్పోకుండా బిఆర్ఎస్ పార్టీ తన బలాన్ని మరోసారి నిరూపించుకుంది. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట జవదాటకుండా కౌన్సిలర్లు అందరూ ఒకే తాటిపై నిలవడంతో చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు తెలుస్తుంది.



నూతన చైర్ పర్సన్ పుష్పలతను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

## రూ.500 బోనస్‌పై రైతులు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దు

**నారాయణపేట టౌన్, నవంబరు 18 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం వరి సన్న రకానికి అదనంగా ఇస్తున్న రూ.500 బోనస్ పై రైతులు ఎలాంటి అనుమానం పెట్టుకోవద్దని ప్రభుత్వం వరికి ఇస్తున్న బోనస్ డబ్బు ఖాతాలలో జమ చేస్తుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ దామరగిద్ద మండలంలోని మల్ రెడ్డిపల్లి, లోకూర్తి గ్రామాలలోని వరి కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. మల్ రెడ్డి పల్లి గ్రామ కొనుగోలు కేంద్రంలో ప్యాడి క్లీనర్ యంత్రంలో ధాన్యం వేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదని అక్కడ సిబ్బంది కలెక్టర్‌కు తెలపడంతో ప్యాడీ క్లీనర్ లో వడ్లు వేయించి మరి కలెక్టర్ పరిశీలించారు. అలాగే వరి గింజ పొడవు, వెడల్పు ను మిషన్ ద్వారా ఆమె పరిశీలించారు.కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని, దొడ్డు రకం వడ్లు రావడం లేదా అని కలెక్టర్ కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, సిబ్బందిని ప్రశ్నించారు. అయితే దామరగిద్ద మండలంలో ఆర్ఎన్ఆర్ రకం వరి ధాన్యాన్ని పండించడంలో ఇదేగ్రామం టాప్‌వరసలో ఉంటుందని వారు కలెక్టర్‌కి తెలిపారు. కేంద్రంలో 13 టార్పాలీన్లు, 5000గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కలెక్టర్ అదే గ్రామంలో –మిగతా2లో..



కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

# రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- అన్ని రంగాల్లో కల్వకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధికి కృషి
- సన్న వరి ధాన్యానికి 500 బోనస్ ధర
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, నవంబరు 18 ప్రభాతవార్త:** కల్వకుర్తి పురపాలక సంఘంలో పలు వార్డుల్లో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. పనులు నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని ప్రజా ప్రతినిధులు, అధికారులు పనులను పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఆదే విధంగా కల్వకుర్తి వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సంజపూర్, మండలంలోని మార్చాలా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పారంభించారు. కోనుగోలు కేంద్రల వద్ద ధాన్యం తేమ శాతాన్ని తేమ శాతాన్ని మిషన్ ద్వారా ఎమ్మెల్యే స్వయంగా చెక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రైతులు ధాన్యాన్ని తేమశాతం 17 శాతం లోపు, తాలు, మట్టి పెడ్డలు లేకుండా మంచి ధాన్యం తీసుకొని రావాలని, ప్రభుత్వం గిట్టుబాటు ధర 2300, 2320 సన్న రకం వరి ధాన్యాన్నికి అదనంగా రూ.500ల అందిస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అని దళారులను నమ్మి మోసపొవద్దు అని అన్నారు. ఆనంతరం మార్చాలా జిల్లా పరిషత్ పాఠశాలలో కంప్యూటర్, విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా, వైద్యానికి, రైతాంగానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు అని అన్నారు. అయన వెంట పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు బాలాజీ సింగ్, పిఎసిఎస్ చైర్మన్ తలసాని జనార్థన్ రెడ్డి, సిఈఓ వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్ కుమార్ రెడ్డి, నాయకులు చంద్రకాంత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి, జంగయ్యగౌడ్, మార్చాలా గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి




విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేపై కలెక్టర్ సమీక్ష

**నారాయణపేట టౌన్, నవంబరు 18 ప్రభాతవార్త :** జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేపై జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం తన ఛాంబర్ లో జిల్లా అధికారులతో మలి దఫా సమీక్ష జరిపారు. మండలాల వారీగా ఇప్పటివరకు ఎన్ని నివాసాల సర్వే పూర్తయిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని మండలాలలో సర్వే చాలా ఆలస్యంగా కొనసాగుతుందని, సంబంధిత సూపర్ వైజర్లు సర్వేను వేగవంతం చేసి పూర్తిచేయించేలా చూడాలన్నారు. సర్వే పూర్తయిన తర్వాత వివరాలతో కూడిన సర్వే ఫారాలను ఎంపీడీవో కార్యాలయాల్లో పెట్టెలలో భద్రపరచాలని సూచించారు.అన్నిఎంపీడీవో కార్యాలయాలకు కొత్తగా పెట్టెలను పంపించడం జరుగుతుందని ఆమె తెలిపారు. అన్ని వివరాలతో నింపిన ఆఫారాల డాటాను కంప్యూటర్లలో ఎంట్రీ చేయడానికి ఆపరేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఈడీఎం విజయ్‌కి సూచించారు. సర్వే పూర్తయిన మండలాలలో డాటా ఎంట్రీ చేయించాలని కలెక్టర్ తెలి పారు. ఈ విషయమై ఈడీఎం స్పందిస్తూ జిల్లాలో వంద శాతం సర్వే పూర్తయిన తర్వాతనే డాటా ఎంట్రీ చేయించాల్సి ఉంటుందని కలెక్టర్ కు తెలిపారు. ములుగు,నల్గొండజిల్లాలలో రెండురోజులలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే వంద శాతం పూర్తయ్యే అవకాశం ఉందని, డాటా ఎంట్రీ విషయంలో ఆయా జిల్లాల అధికారులు ఇచ్చే ఫీడ్ బ్యాక్ తీసుకొని మిగతా జిల్లాలలో డాటా ఎంట్రీ ప్రక్రియను ప్రారంభించుకోవాల్సి ఉంటుందనే అభిప్రాయాన్ని ఈడీఎం వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ మన జిల్లాలో సర్వే పూర్తికావడానికి ఇంకా సమయం పడుతుందని, అంతవరకు రెండేసి మండలాల చొప్పున కంప్యూటర్ ఆపరేటర్లకు జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం చౌరస్తా వద్ద గల వృత్తి శిక్షణ కేంద్రంలో రెండు మండలాల చొప్పున కం ప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇప్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సాంఘి క సంక్షేమ శాఖ వసతి గృహాలలో అందుబాటులో ఉన్న ల్యాబ్‌ట్యాప్ లను డాటా ఎంట్రీకి వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. కాగా అంతకుముందు డాటా ఎంట్రీ కోసం జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా కేంద్రానికి సమీపంలోని శ్రీదత్త బిఈడి కళాశాల, కోస్గి ఇంజనీరింగ్ కళాశాలలను పరిశీలించే అంశ మై కలెక్టర్ అధికారులతో చర్చించారు. జిల్లాలో వంద శాతం సర్వే పూర్తి చేయించాలని ఈ సందర్భంగా సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో రెవిన్యూ జిల్లా అదనపు కలెక్టర్ బేన్ షాలం, డిఆర్డిఓ మొగులప్ప, డిపిఓ కృష్ణ, సిపిఓ యోగానంద్, మున్సిపల్ కమిషనర్ సునీత పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

## ఏసీబీ వలలో పంచాయతీరాజ్ ఏఈ

### రూ.50 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

**ఇటిక్యాల,నవంబరు 18 ప్రభాతవార్త :** మండల పంచాయత్ రాజ్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీరుగా పనిచేస్తున్న పాండురంగారావు సోమవారం మధ్యాహ్నం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలోని ఓ షాప్‌లో మధ్యాహ్నం ఒంటిగంట పది నిమిషాల సమయంలో ఓ వ్యక్తి నుండి రూ. 50 వేల లంచంగా తీసుకున్న పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ పాండురంగారావును ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ఆర్. గార్లపాడు గ్రామంలో మైనార్టీ కమ్యూనిటీ హాల్ భవనం నిర్మాణం చేయగా అందుకు సంబంధించి ఎంబి రికార్డు చేసేందుకు 50వేల రూపాయలు లంచం డిమాండ్ చేయగా అదే గ్రామానికి చెందిన వ్యక్తుల నుండి 50 రూ.వేల లంచం అసిస్టెంట్ ఇంజనీర్ పాండురంగారావు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబి అధికారులు తెలిపారు. లంచం తీసుకున్నది వాస్తవమేనని నిర్ధారణ జరిగిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లంచం తీసుకున్న అధికారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టుకు తరలించినట్లు ఏసీబి అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ఒక ప్రకటన చేస్తూ ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినట్లయితే ఏసీబీ అధికారులను ఆశ్రయించాలని లేదా టోల్ ఫ్రీ నెంబర్1064 నంబర్ కు కాల్ చేయవచ్చని సమాచారం ఇచ్చిన వారి పేర్లను సీక్రెట్‌గా ఉంచుతామని ఏసీబి అధికారులు తెలిపారు..



లంచం తీసుకుంటూ ఏసీబి అధికారులకు చిక్కిన ఏఈ

## రైతులకు అసౌకర్యం కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

### ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన చిన్నారెడ్డి

**వనపర్తి ప్రతినిధి నవంబరు 18 ప్రభాతవార్త:** రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు అన్నారు. సోమవారం ఆయన వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ తో కలసి వనపర్తి నియోజకవర్గం లోని తాడిపర్తి, బుద్ధారం, చాకలి పల్లి గ్రామాలలో వరి ధాన్యము కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు ,ఈ సందర్భంగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వంగా ఈ రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం ఇప్పటివరకు 18 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని త్వరలోనే మిగతా 12 వేల కోట్ల రూపాయలను పంట రుణమాఫీ కోసం ఖర్చు చేసి సంపూర్ణంగా రుణమాఫీ చేస్తామని రైతు భరోసా పథకం కింద రైతులకు ఇవ్వాల్సిన 7500 నిధులు కూడా ఈ నెలలో ప్రభుత్వం రైతుల అకౌంట్లో జమ చేస్తుందని ఆయన వెల్లడించారు. అంతేకాక రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు వరి ధాన్యం సన్న వరి ధాన్యం పై క్వింటాలకు 500 రూపాయల బోనస్ కూడా ప్రభుత్వం చెల్లిస్తుందని గ్రామాలలో ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రాలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మెప్మా ధాన్యం కొనుగోలు కేంద్రాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని ఎక్కడ చూసినా రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమ తమ పండించిన పంటను తరలిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యం డబ్బులను రైతులు అకౌంట్లో వెంటనే వేస్తున్నామని చిన్నారెడ్డి తెలిపారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు తీసుకువస్తున్న వరి ధాన్యంతో పాటు వేరుశనగ పంటకు గిట్టుబాటు ధరతో పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ధాన్యం ఎక్కడ కూడా జాప్యం చేయకుండా కొనుగోలు జరుగుతుందని పేర్కొన్నారు, మార్కెట్ యార్డులో రైతులకు ఇతర వసతులతో పాటు ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఆటంకం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో గోపాల్పేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్య శిలా రెడ్డి, డిఆర్డిఏ అధికారి అరుణ వివిధ గ్రామాల మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన చిన్నారెడ్డి

## లారీ కింద పడి ఇద్దరు దుర్మరణం



లారీ కింద పడి మృతి చెందిన యువకులు

**వనపర్తి క్రైమ్ నవంబరు 18 ప్రభాతవార్త :** చీమనగుంటపల్లి శివారులో లారీ కిందపడి ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది, పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం సుమారు రాత్రి 10 గంటల 20 నిమిషాల సమయంలో, చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన ఆర్కట శివుడు తండ్రి చిన్న కురుమన్న వయసు 19 సంవత్సరాలు, వృత్తి సెంట్రింగ్ వర్క్ అదే గ్రామానికి చెందిన బాలకృష్ణ అలియాస్ విజయకుమార్ తండ్రి దస్తగిరి వయసు 20 సంవత్సరాలు, ఇద్దరు కలిసి వనపర్తి నుండి చిమన గుంటపల్లి గ్రామానికి చెందిన శివుడు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, మార్గమధ్యంలో చిమనగుంటపల్లి గ్రామ శివారులో షిరిడి సాయి బ్రిడ్జి దగ్గర, ఎపీ, 16 టిబి, 7716, నంబరు గల వడ్ల లోడుతో ఉన్న లారీ కాంట వేసుకొని లారీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా ఎలాంటి సిగ్నల్ వేయకుండా వెనుకకు సడన్ గా రివర్స్ తీయడం వలన బైక్ నడుపుతున్న శివుడు లారీ వెనక టైరుకు ఢీకొని బైక్ పై నుండి కింద పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు, ఈ ప్రమాదంపై మృతుడు శివుడు తండ్రి, ఆర్కట చిన్న కుర్మయ్య, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సలహాలు సూచనలను ప్రభుత్వానికి తెలియజేస్తాం

### స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ పై ప్రజాభిప్రాయ సేకరణలో డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర రావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 18 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కల్పన పేర్కొనే విషయంపై వెనుకబడిన వర్గాల (బీసీ) ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనమునకు చేరుకున్న డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ బూసాని వెంకటేశ్వర రావు, సెక్రెటరీ సైదులు ఐఎఫ్ఎస్, జిల్లా యంత్రాంగం తరపున జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్.పి.డి.జానకి,రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు కలిసి స్వాగతం పలికారు. జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ బూసాని వెంకటేశ్వర రావు, సెక్రెటరీ సైదులు ఐఎఫ్.ఎస్. కలిసి స్థానిక సంస్థల్లో బి.సి రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి బహిరంగ చర్చను ఏర్పాటు చేశారు. ఈ బహిరంగ చర్చలో చైర్మన్ బూసాని వెంకటేశ్వర రావు మాట్లాడుతూ లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వశాఖలు,బీసీ కమిషన్,బీసీ సంఘాల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తీసుకుంటామని తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కల్పన పేర్కొనే విషయంపై వెనుకబడిన వర్గాల (బీసీ) ప్రజాభి ప్రాయ సేకరణ లో బి.సి.లకు జనాభా పరంగా రిజర్వేషన్లు కల్పించాలని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెంది న పలువురు బి.సి.సంఘాలు వినతులు అంద చేశారు. పద్మశాలి సంఘం,ఎరుకల సంఘం, యాదవ సంఘం .మేధర,కుమ్మరి సంఘం, రజక సంఘం, నాయి బ్రాహ్మణ,విశ్వ కర్మ, తదితర సంఘాల నుండి సుమారు 70 వినతులు, సలహాలు, సూచనలు తీసుకోవడం జరిగిందన్నారు. కమీషన్‌కు అందిన సలహాలు, వినతులు, అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వంకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రజాభి ప్రాయ సేకరణలో బి.సి.సంక్షేమ శాఖ అధికారిణి ఇందిర, స్థానిక ప్రజాప్రతినిధులు, పలు బిసి సంఘాల నాయకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న భూసాని వెంకటేశ్వరరావు

# రైతులకు సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుంది

**కొండేరులో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన**

**అధికారులు కాంగ్రెస్ నాయకులు**

**కొండేరు జింకలపల్లి వరి కొనుగోలు కేంద్రాలను**

**పరిశీలించిన జిల్లా సివిల్ సప్లై అధికారి స్వామి కుమార్**



కొండేరులో వరి ధాన్యాన్ని
పరిశీలిస్తున్న జిల్లా సివిల్ సప్లై అధికారి స్వామి కుమార్

**ఇటిక్యాల నవంబరు 18 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా వరి పండించిన రైతులకు రూ.500 బోనస్ అదనంగా చెల్లిస్తుందని అలాగే రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు కేంద్రాల ద్వారా వారిని కొనుగోలు చేస్తుందని 17 తేమ ఉండేలా చూసుకుని రైతులు కేంద్రానికి తెచ్చుకోవాలని వాటికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2320 చెల్లిస్తుందని ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్. పోతురాజు సోమనాద్రి. మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రుక్మానందరెడ్డి రైతులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని కొండేరు గ్రామంలో ఐకెపి ద్వారా ఏపిఎం కురుమన్న. ఏఈఓ ప్రవళిక. సిసి బీచుపల్లి. మహిళా సమాఖ్య సంఘ అధ్యక్షురాలు పద్మమ్మ. వివో ఏ గోవిందమ్మ . స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి వారు వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు పండించిన వడ్లను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి 17 తేమ ఉండేలా చూసుకోవాలని వాటికి ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందని వాటితో పాటు క్వింటాల్‌కు 500రూపాయల బోనస్ కూడా అదనంగా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు బీచుపల్లి, హనుమంతు, తిమ్మప్ప గౌడ్, సిరాజ్.యోహాన్, రాజు పాల్గొన్నారు.

**కొండేరు, జింకలపల్లి వరి కొనుగోలు**

**కేంద్రాలను పరిశీలించిన జిల్లా సివిల్ సప్లై అధికారి**

మండల పరిధిలోని కొండేరు. జింకలపల్లిలో ఐకెపి ద్వారా ప్రారంభించిన వరి కొనుగోలు కేంద్రాలను సోమవారం జిల్లా సివిల్ సప్లై అధికారి స్వామి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని 17 తేమ ఉండేలా చూసుకోవాలని అలాగే మట్టి పెళ్లలు లేకుండా ఉండాలని వాటికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాల్ కు 2320 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ప్రైవేటు దళారులను నమ్మవద్దని ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని ఐకెపి అధికారులకు, మహిళా సంఘం సభ్యులకు జిల్లా సివిల్ సప్లై అధికారి స్వామి కుమార్ ఆదేశించారు.

## మండల సగర నూతన కమిటీ ఎన్నిక

**వెల్దండ,నవంబరు 18 ప్రభాతవార్త:**వెల్దండ మండల కేంద్రంలో సగర సంఘ సభ్యులు సోమవారం సమావేశమై మండల నూతన కమిటీని జిల్లా నాయకులు వావిలాల భీమయ్య సగర ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఆలేటి నారాయణ సగర, గౌరవ అధ్యక్షులుగా సంద వెంకటేష్ సగర, ఉపాధ్యక్షులుగా ఆలేటి.జంగయ్య సగర, ద్యాప లక్ష్మయ్య సగర, ప్రధాన కార్యదర్శిగా ధ్యాప జంగయ్య సగర, సహాయ కార్యదర్శిగా కొండశేఖర్ సగర, కోశాధికారిగా మెరుగు రవీందర్ సగర, ప్రచార కార్యదర్శిగా కొండ రాఘవేందర్ సగర, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల నూతన కమిటీని పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ఆలేటి నారాయణ సగర మాట్లాడుతూ సగరుల అభ్యున్నతి కోసం సగరులను బిసి-డి. నుండి బిసి-ఏ మార్పు కొరకు ప్రతి ఒక్కరం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నూతన కమిటీ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వెల్దండ, కుప్పగండ్ల, కల్వకుర్తి మండల కమిటీ సభ్యులు సగర సంగ సోదరులు పాల్గొన్నారు

## పేదలను ఆదుకునే బాధ్యత కాంగ్రెస్ పార్టీదే

**ఆత్మకూరు నవంబరు 18 ప్రభాతవార్త :** రాష్ట్రంలో నిరుపేదలను ఆదుకునే బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని మక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తులసి రాజు యాదవ్ అన్నారు పేదలకు ఆరోగ్యపరంగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను యుద్ధప్రాతిపదికన ఎప్పటికప్పుడు అందజేస్తూ పేద ప్రజల ప్రాణాలను కాపాడుతుందని ఆయన పేర్కొన్నారు సోమవారం రోజు ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామానికి చెందిన శేఖర్ రెడ్డి కి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలను కాపాడే ఉద్దేశంలో భాగంగానే ఎప్పటికప్పుడు మంజూరైన నిధులను అందజేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్, మాజీ మండల అధ్యక్షులు రహమతుల్లా ,ఆత్మకూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సేవలను వినియోగించుకోవాలి

**ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి:జిల్లా ఎస్పీ**

**వనపర్తి క్రైమ్ నవంబరు 18 ప్రభాతవార్త :**పోలీస్ గ్రీవెన్స్ కి వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ పోలీసులకు ఆదేశించారు సోమవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని ఎస్పీ రావుల గిరిధర్ నిర్వహించారు ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 7 మంది ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీసు స్టేషన్ ఎస్ఐ సిఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్చందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్పీ తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని తెలియజేశారు.ఫోటోరైటప్:18గద్వాల54: ప్రజావాణిలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ, రావుల గిరిధర్

## రైతులు దళారీలను నమ్మి మోసపోవద్దు

**రైతుల ఖాతాలో సన్న వడ్లకు రూ.500 బోనస్ : డిసిసిబి చైర్మన్**

**వీపనగండ్ల నవంబరు 18 ప్రభాతవార్త :**రైతులు దళారీలను నమ్మి మోస పోవద్దని ప్రభుత్వం ఏర్పాటుచేసిన మహిళా సంఘాలు ఏర్పాటుచేసినవరి కొనుగోలు కేంద్రాలలోని ధాన్యాన్ని అమ్ముకోవాలని అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు ఇస్తున్న 500 బోనస్ రూపాయలను రైతుల వారి ఖాతాలో వేయడం జరుగుతుంది అని డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువ ర్ధన్ రెడ్డి తెలిపారు సోమవారం నాడు



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ చైర్మన్

పుల్గర్‌జర్ల,గోపాల్దిన్నె గ్రామాలలో,పానగల్ సింగల్ విండో ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు ఈ సందర్భంగా మాజీ రైతు మండల సమన్వయ అధ్యక్షుడు నారాయణరెడ్డి రైతు బంధు మాజీ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య తో కలిసి ఆయన మాట్లాడారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చడం జరిగిందని వారు ఈసందర్భంగా తెలిపారు.అయితే రైతులు వరిధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసినటువంటి కొనుగోలుకేంద్రాలలో అమ్ముకోవాలని దళారులను నమ్ముకుంటే మోసపోవాల్సిన అవసరం ఏర్పడుతుందని వారు తెలిపారు .అయితే ప్రభుత్వాన్ని నిబంధనల ప్రకారం లావు వరి ధాన్యానికి 17శాతం సన్న వరి ధాన్యానికి 14 శాతం తేమశాతం ఉండాలని ఆ రకంగా రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టి తూకం చేయించుకోవాలని వారు రైతులకు సూచించారు. అదేవిధంగా వరి ధాన్యాన్ని తూకం చేసిన వెంటనే రైతులకు రసీదులు ఇవ్వాలని వారు మహిళా సంఘాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాల్దిన్నె గ్రామానికి చెందిన బాల్ రెడ్డి ,సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో సైబర్ నేరాలపై అవగాహన

**ఆత్మకూరు నవంబరు 18 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో సోమవారం రోజు ఆత్మకూరు ఎస్సై నరేందర్ ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ నేరాలపై జరుగుతున్న దోపిడీ పట్ల అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు.ఈసందర్భంగా ఎస్సై నరేంద్ర మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు అప్రమత్తమై ప్రజలను మోసం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలకు ఎవరూ కూడా నమ్మి మోసపోకూడదని ఎస్సై



ఆత్మకూర్ బస్టాండ్లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

నరేంద్ర సూచించారు. అంతేకాకుండా వీడియో కాల్ చేసి మీకు లాటరీ తగిలిందని డబ్బులు పంపిస్తామంటూ మాయ మాటలు చెప్పి పలు రకాల మోసాలకు పాల్పడుతున్న విషయాన్ని ప్రజలు గమనించాలని ఈ విషయంపై ఎలాంటి ఫోన్ కాల్స్ వచ్చిన వెంటనే పోలీసులను సంప్రదించి అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. అంతేకాకుండా మండలంలోని వివిధ గ్రామాలలో సైబర్ నేరాలపై జరుగుతున్న అవగాహన కార్యక్రమాలకు ప్రజారావు స్వచ్ఛందంగా సహకరించడం సంతోషకరమైన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నరేంద్ర తో పాటుగా హెడ్ కానిస్టేబుల్ బీచ్ పుల్లయ్య పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి

**సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు డిమాండ్**

**వనపర్తి టౌన్ నవంబరు 18 ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ కార్మికులకు గత మూడు నాలుగు నెలల నుండి జీతాలు బకాయిలు ఉన్నాయని పెండింగ్ జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓ భాను ప్రకాష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా



కలెక్టరేట్‌లో ఏఓ కు వినతిపత్రం అందజేస్తున్న ఎంప్లాయిస్

అధ్యక్షుడు మండ్ల రాజు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నాలుగు నెలల నుండి జీతాలు బకాయిలు ఉన్నాయని, పండుగకు కూడా జీతాలు రాలేదని ప్రశ్నించారు. తక్కువ జీతాలు పైగా నెలల తరబడి జీతాలు బకాయి ఉండడంతో కార్మికులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వచ్చే దసరా లోపల జీతాలు చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేసి బట్టలు సబ్బులు నూనెలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పెట్టిన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని జీతాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులపై పని భారం వేధింపులు ఆపాలని, ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు వారి కుటుంబంలో ఉద్యోగం ఇచ్చి 25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. జీఓ 51 సవరించాలని వారంతపు సెలవులు పండుగ సెలవులు ఇవ్వాలని, పిఎఫ్ ఇఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, నాయకులు నందిమల్ల రాములు, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా జిల్లా కోశాధికారి పుష్ప, శీను ,దాసు ,రామచంద్రయ్య ,గంగా ,నరసింహ ,భద్రయ్య ,జమ్ములు, సుగ్రీవుడు తదితరులు పాల్గొన్నారు.

## ఛాంపియన్ షిప్ పోటీలను విజయవంతం చేయండి

**-కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి,నవంబరు 18 ప్రభాతవార్త:**10వ తెలంగాణ రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ ఛాంపియన్షిప్ పోటీలను విజయవంతం చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ కాస్ కంట్రీ పోటీల వాల్ పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యావత్ తెలంగాణ నుంచి 1100మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.పురుషులకు, మహిళలకు (10కిలో మీటర్లు),20సంవత్సరాల బాల (8కిలోమీటర్లు) బాలికలకు (6కిలో మీటర్లు), 18సంవత్సరాలలోపు బాల (6కిలో మీటర్లు) బాలికలకు (4 కిలో మీటర్లు) 16 సంవత్సరాల లోపు బాలబాలికలకు.. (2కిలో మీటర్లు) పోటీలు జరుగుతాయని అన్నారు.ఈ రాష్ట్రస్థాయిలో పోటీల్లో విజేతలుగా నిలిచిన 32 మంది క్రీడాకారులు జాతీయ స్థాయికి వెళ్తారని ఆయన తెలిపారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్ ఠాగూర్,మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్ కుమార్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, కౌన్సిలర్స్ రామ్‌రెడ్డి, రవి, సతీష్, కాటిక రామస్వామి, పాలెపు కొండలు, అథ్లెటిక్స్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పోలే అంజయ్య ఫిజికల్ డైరెక్టర్ ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలకు ప్రభుత్వం నిర్ణయం

**నారాయణపేట టౌన్, నవంబరు 18 ప్రభాతవార్త :** ఈ నెల 20 న నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్ లో తెలంగాణ ప్రజా పాలన విజయోత్సవ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఏడాదిలో అమలైన సంక్షేమ, అభివృద్ధి పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించి, ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యం లో కళా బృందాలతో వివిధ కార్యక్రమాలను చేపట్టిందని, ప్రతీ జిల్లాలో వరుస కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్న ప్రభుత్వం ఈ నెల 17 నుంచి డిసెంబర్ 7 వరకు వివిధ జిల్లాల్లో కళాబృందాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల పై ప్రచారం చేయనున్నారని తెలిపారు. ఇందుకు గాను సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ ప్రొఫెసర్ అలేఖ్య ఆధ్వర్యంలో పుంజల ఒకటో బృందం, అంతడుపుల నాగరాజు ఆధ్వర్యంలో రెండవ బృందం వివిధ జిల్లాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించ నున్నారు ఇందులోభాగంగా ఆదివారం మొదటి బృందం రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ లో, రెండవ బృందం సంగా రెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం జోగి పేటలో ప్రజాపాలన విజయోత్స వకార్యక్రమాలు నిర్వహించారు. నారాయణపేట జిల్లాలో ఈ నెల 20 న నారాయణ పేట లోని అంజనా గార్డెన్ లో ప్రజా పాలన విజయోత్సవాలు, కళాబృందం ప్రదర్శన నిర్వహిస్తారు. ప్రతిష్టాత్మక పథకాలు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పంట రుణాలమాఫీ, ఉద్యోగాల భర్తీ, రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన వంటి సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని, అలాగే రైతుభరోసా, స్కిల్ యూనివర్సిటీ, ఎస్.హెచ్.జీ మహిళలకు రుణాలు వంటి పథకాలపై దృష్టి పెట్టిందని,ఈ పథకాల ద్వారా పొందుతున్న లబ్దిని ప్రజల్లోకి మరింతగా తీసుకు వెళ్లేందుకు ఈ విజయోత్సవాలు చేపట్టారని కలెక్టర్ పేర్కొన్నారు. పండుగలా"ప్రజాపాలనకు విజయోత్సవాలు అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే మార్గాల్లో భాగంగా రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ప్రజా పాలన కళాయాత్ర చేపట్టాలని ప్రభుత్వం సాంస్కృతిక శాఖకు ఆదేశించిందని, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందాలు అన్ని జిల్లాలు తిరగనున్నాయి. ఈ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

## సైబర్ క్రైమ్, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

**మహిళ సాధికారత కేంద్రం స్పెషలిస్ట్ ఫైనాన్షియల్ లిటరసీ సుమ**

**కొత్తకోట నవంబరు 18 ప్రభాతవార్త:** బాల్య వివాహాల వల్ల బాలికలు తమ చదువుకు దూరం అవుతున్నారని, 18 సం,, నిండిన తర్వాత వివాహం చేసుకోవాలనీ మహిళ సాధికారత కేంద్రం స్పెషలిస్ట్ ఫైనాన్షియల్ లిటరసీ సుమ అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ ఫైనాన్షియల్ లిటరసీ సుమ మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల బాలికలు తమ చదువుకు దూరం అవుతున్నారని, 18 సం,, నిండిన తర్వాత వివాహం చేసుకోవాలనీ, అలా లేని పక్షంలో బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం చట్టరీత్యా చర్య శిక్షకు గురవుతారని తెలిపారు. సైబర్ క్రైమ్ లో భాగంగా చాలామంది విద్యార్థులు సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్, వాట్సాప్ లో అజాగ్రత్తగా ఫోటోలను షేర్ చేయడం వల్ల సైబర్ నేరగాలు వాటిని తమ కనుకూలంగా మార్చుకుంటూ అమ్మాయిలను ఇబ్బందులకు గురి చేస్తారని కాబట్టి అమ్మాయిలు తగు జాగ్రత్తలు తీసుకోవాలనీ పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు సోషల్ మీడియాలో వివిధ లింక్స్ పంపించి ఇబ్బందులకు గురి చేస్తారని, ఓటిపిల పేరుతో, ఓఎల్ఎక్స్, ఫేస్ బుక్ నకిలీ ఐడిల రూపంలో, మొబైల్ ఫోన్లకు మెసేజ్ లు పంపి ఆ లింక్ క్లిక్ ఎలాంటి లింక్స్ వచ్చినా కూడా వాటిపైన క్లిక్ చేయకుండా జాగ్రత్త పడాలని సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్స్ బాలలకు 1098, సైబర్ క్రైమ్ సంబంధించి 1930, మహిళలకు గృహహింస 181, పోలీస్ 100, బాల కార్మిక నిర్మూలన 14567 టోల్ ఫ్రీ నెంబర్లు వాటి ఉపయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం పై విద్యార్థులు ఉపాధ్యాయులు అభినందిస్తూ మహిళా సాధికారిక కేంద్రం సుమ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిక కేంద్రం స్పెషలిస్ట్ ఇన్ ఫైనల్ లెటర్స్ సుమ, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లిటరసీ సుమ

## దర్గా నిర్మాణం బీఆర్ఎస్ హయంలోనే..

**అవగాహన రాహిత్యంతోనే కాంగ్రెస్ విమర్శలు .. బీఆర్ఎస్ నాయకులు జహంగీర్**

**వనపర్తి టౌన్ నవంబరు 18 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణంలో జరిగిన రోడ్ల విస్తీర్ణంలో పాత బజారులోని నల్ల చెరువు కట్టపై పురాతన దర్గాను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తమ సొంత నిధులతో కొత్త దర్గా నిర్మాణం చేశారనీ బీఆర్ఎస్ నాయకులు జహంగీర్ పేర్కొన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నివాసంలో బీఆర్ఎస్ నాయకులు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు జహంగీర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మెఘా రెడ్డి దర్గా నిర్మాణం చేశారని అనడం నాయకుల అవగాహన రాహిత్యమని విమర్శించారు. దర్గా నిర్మాణం చేసిన మేస్త్రీ, కూలీలకు, స్టీల్, సిమెంట్ షాప్ వారికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే నల్లచెరువు కట్టపై గల మైబుసాని దర్గా దగ్గరకొచ్చి ప్రమాణం చేసీ మేఘా రెడ్డి నిర్మాణం చేశారని ప్రమాణం చేయడానికి సిద్ధమా అని సవాలు విసిరారు. అవగాహన లేకుండా పత్రిక సమావేశాలు పెట్టి ప్రజల్ని గందరగోళంలోకి నెట్టవద్దని, వనపర్తిలో ముస్లింలకు నిరంజన్ రెడ్డి నాయకత్వంలో గురుదృష్టితో రాబోయే భవిష్యత్ తరాల కొరకు చేసిన అభివృద్ధి అంతా ఇంతా కాదని వాఖ్యానించారు. వనపర్తిలో అద్భుతమైన షాదీఖానాలను రెండు కోట్ల ఎనభై లక్షల రూపాయలతో అద్భుతంగా అన్ని రంగులతో నిర్మాణం చేపట్టారని అన్నారు. అప్పట్లో బిజెపి ఇప్పుడు కాంగ్రెస్ లో ఉన్న నాయకులు మారెమ్మ కుంటలో గల పురాతన కబురస్థానీ ఆక్రమించడానికి చూసింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఆక్రమణను ఆపి మాజీ మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ ఎలాంటి ఎస్టిమేషన్ లేకుండా అప్పటికప్పుడు 13 లక్షలు కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో స్టార్ రహీమ్, సయ్యద్ జమీల్, వహీద్, ముద్దసర్, ఖాదర్, అలీమ్, ఖాధర్షా, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.500 బోనస్‌పై రైతులు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దు

**మొదటిపేజీ తరువాయి భాగం..**

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పర్యవేక్షించారు. గ్రామంలో సర్వే ఎంతవరకు వచ్చిందని ఎన్యుమ రేటర్‌ను ప్రశ్నించగా, మంగళవారం వరకు సర్వే పూర్తవుతుందని, ఇంకా 10 నివాసాలు మిగిలి ఉంటాయని, కానీ ఆయా ఇళ్ల యజమానులు హైదరాబాద్, ముంబయి నగరాలలో ఉంటున్నారని ఎన్యుమరేటర్ కలెక్టర్ తెలిపారు. చివరగా కలెక్టర్ లోకూర్తి గ్రామ రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రానికి వచ్చిన ధాన్యం తేమశాతాన్ని చూశారు. రైతు వేదికలో రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, ప్రభుత్వం ధాన్యానికి బోనస్ 500 అదనంగా ఇస్తుండడంతో నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. అయితే కొందరు రైతులు వరి ధాన్యం బోనస్ డబ్బు జమ అవుతుందా? లేదా ? అని కలెక్టర్‌ను అడగడంతో బోనస్ పై రైతులు ఎలాంటి అనుమానం పెట్టుకోవద్దని, ఖచ్చితంగా బోనస్ డబ్బు ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో జమ అవుతుందని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం దేవదాస్, ఎంపీడీవో సాయి లక్ష్మి, ఐకెపి, సింగిల్ విండో అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా గ్రూప్3 పరీక్షలు

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేటటౌన్, నవంబరు 18 ప్రభాతవార్త :** రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా రెండు రోజుల పాటు నిర్వహించిన గ్రూప్3 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు.కాగా సోమవారం జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 4024 మంది అభ్యర్థులకు గాను 2331 మంది హాజరు కాగా, 1693 మంది గైర్హాజరు అయ్యారని, సగటున 58 శాతం హాజరు నమోదయ్యిందని ఆమె వెల్లడించారు.

## జాతీయస్థాయి గో గేమ్‌లో రాష్ట్ర జట్ల ప్రతిభ



**మహబూబ్‌నగర్ స్పోర్ట్స్,నవంబరు 18 ప్రభాతవార్త :** ఈనెల 15వ తేదీ నుండి 17వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్లో ఇందోర్‌లో జరిగిన రెండవ సీనియర్, మొదటి సబ్ జూనియర్, జూనియర్ బాల బాలికల విభాగాలలో గో గేమ్ జాతీయస్థాయి పోటీలు నిర్వహించారు.ఈపోటీలలో తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు ప్రతిభ కనబరచి రాష్ట్రానికి వివిధ అంశాలలో పథకాలు సాధించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గో గేమ్ అధ్యక్ష కార్యదర్శులు నర్సుల హైదర్, గులాం అష్రోజ్, కోశాధికారి వినోద్ కుమార్, సీనియర్ ఉపాధ్యాక్షుడు షకీల్ అహ్మద్ సంఘం సభ్యులు క్రీడాకారులను అభినందించారు. సబ్ జూనియర్ సింగిల్స్ విభాగంలో చేతన్ చంద్ర, కే శిరీష బంగారు పతకం. జూనియర్ సింగిల్స్ విభాగం లో కే. హారిక బంగారం పతకం, బషీర్ కాంస్యం పతకం, సీనియర్స్ సింగిల్ విభాగంలో మొహమ్మద్ రయాన్ నజం, బంగారు పతకం, సబ్ జూనియర్ టీం ఈవెంట్ లో బంగారు పతకం, 5 బంగారు పతకాలు, 1 కాంస్య పతకం సాధించినట్లు సీనియర్ ఉపాధ్యాయుడు షకీల్ అహ్మద్ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన కోరారు.

## నేడు స్విట్స్ కళాశాలలో మెగా జాబ్‌మేళ

**దేవరకద్ర.నవంబరు 18 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం చౌదర్‌పల్లి స్విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మెగా జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు కళాశాల డీన్ డాక్టర్ కే.సుధాకర్,ప్రిన్స్‌పాల్ పి.సుధాకర్ సోమవారం తెలిపారు.రిలయన్స్ మరియు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్‌ల సంయుక్త అధ్వర్యంలో ఈ మెగా జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.ఈ మెగా జాబ్‌మేళాను కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.ఈ మెగా జాబ్‌మేళాలో దాదాపు 10 కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు.ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 3వరకు ఈ మెళా నిర్వహి స్తున్నట్లు వారు తెలిపారు.దీనికి కృషి చేసిన శ్రీనును కళాశాల యాజమాన్యం అభినందించింది.ఈసందర్భంగా మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ మాస్టర్ ట్రైనింగ్ అధికారి మొహ్మద్ తౌసిన్‌బరి విద్యార్థులకు శిక్షణ తరగతులను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమం కన్వీనర్ బి.శ్వేత,జయంతి ఎడ్యుకేషన్ సొసైటి అధ్యక్షుడు బాలీశ్వర్, ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి,కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి,కోశాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కులగణన సర్వేను పరిశీలించిన అధికారులు



**దేవరకద్ర,నవంబరు 18 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం బస్వాయపల్లిలో సోమవారం జరిగిన కులగణన సర్వేను మండల అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా సర్వే నిర్వహకులను అధికారులు అన్ని వివరాలు అగిడితెలుసుకొన్నారు.ఈ కార్యక్రమంలో తమశీల్దార్ కృష్ణయ్య,శరత్ పాల్గొన్నారు.

## రూ.1913 ధర పలికిన హంస

**దేవరకద్ర,నవంబరు 18 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం రైతులు 52 కింటాళ్ళ హంస ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.1913 ధర పలికింది.అతి తక్కువగా రూ.1889 ధర పలికింది.అలాగే 1570 కింటాళ్ళ ఆర్ఎన్ఆర్ ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్ ధాన్యానికి రూ.2469 ధర పలికింది.అలాగే అతి తక్కువగా రూ.1901 ధర పలికింది.అలాగే 5 కింటాళ్ళ పత్తిని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి కింటాల్‌కు అత్యధికంగా రూ.5789 ధర పలికింది.అలాగే అతితక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రారంభం

**ఆత్మకూరు నవంబరు 18 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని దేవరపల్లి గ్రామంలో సోమవారం రోజు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే పథకాన్ని ప్రారంభించారు. హెల్త్ సూపర్వైజర్ సురేందర్ గౌడ్, కుటుంబ సర్వే ఎన్నో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వేలో భాగంగా ఆయా గ్రామాలలోని ఇంటి యజమాని పిల్లల పేర్లు నమోదు చేసుకుని ఆరోగ్య పరరీక్షలు నిర్వహించడమే కాకుండా మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లుగా ఆయన తెలిపారు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో కొనసాగే జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే పథకానికి ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కుటుంబ సర్వే ఆరోగ్య పథకం ఎన్యుమరేటర్లు శ్రీకాంత్ తదితరులతో పాటుగా ఏఎన్ఎం జయంతి ఆశా వర్కర్ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రజాస్వామ్యం చచ్చిపోయింది

■ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రతంగ్‌పాండురెడ్డి

**నారాయణపేట టౌన్, నవంబరు 18 ప్రభాతవార్త:** లగచర్ల బాధితులను కలవడానికి వెళుతున్న బిజెపి ఎంపిలు డికె.అరుణ, ఈటల రాజేందర్, బిజెపి పక్షనేత మహేశ్వర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడునాగురావు నామాజీ నారాయణపేట జిల్లా బిజెపి అధ్యక్షుడు పి.శ్రీనివాసులును పోలీసులు అడ్డగించి అరెస్టు చేయడాన్ని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే.రతంగ్ పాండు రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో నియంత పాలన సాగుతున్నది, ప్రజాస్వామ్యం చచ్చిపోయిందని మండి పడ్డారు. అక్రమ అరెస్టులు చేసినంత మాత్రాన బిజెపి నాయకులను భయపెట్ట లేరని తెలిపారు. బిజెపి పక్షనేత,ఇతర నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని అన్నారు. జాతీయ పార్టీ ఉపాధ్యక్షులు, ఎంపిగా తన పార్లమెంట్ పరిధిలో పర్యటించేందుకు వెళుతుంటే ఏ అధికారంతో అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలనీ డిమాండ్ చేశారు. ఒక ఎంపిగా పార్లమెంట్ పరిధిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుకునే హక్కు ఎంపికి ఉందన్నారు. కానీ రాష్ట్ర పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా ఎంపిలను అరెస్టు చేయడం దారుణమనన్నారు. నియంతృత్వ పాలన చాలా రోజులు సాగదని దీనికి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అభివృద్ధి చేయలేక కాంగ్రెస్ పాలకులు ఆడలేక మద్దెల ఒడు అన్న చందంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సంపాదించాలి

**గద్వాల నవంబరు 18 ప్రభాతవార్త:** విద్యార్థులు ఇష్టంతో కష్ట పడి చదివి ఉన్నత ఉద్యోగాలు సంపాదించాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం గద్వాల గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.జోగులాంబ గద్వాల జిల్లా చైర్మన్ నీలి శ్రీనివాస్‌లు అధ్యక్షతన విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గద్వాల గ్రంథాలయంలో నిరుద్యోగ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకు అన్ని కాంపిటీటివ్ పుస్తకాలు అందుబాటులో ఉంచుతామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కవి సమ్మేళనాలు ఘనంగా చేస్తామని తెలిపినారు.గద్వాల అంటేనే విద్వత్ అని పేరు ఆ పేరుకు తగ్గట్టుగా గద్వాలలో విద్యుత్ గద్వాలకు ఆ పేరుతిరిగి వచ్చేటట్లు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి శామ్ సుందర్, గ్రంథాలయం పాలకుడు రామాంజనేయులు, గ్రంథాలయ సిబ్బంది శ్రీకాంత్,గోపాల్ తదితరులు పాల్గొన్నారు. నేడు ముగ్గుల పోటీలు గ్రంథాలయం 57 వ వారోత్సవాలలో భాగంగా మంగళవారం మహిళలకు, విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు స్థానిక సంతాన వేణుగోపాలస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయం చైర్మన్ నీలి శ్రీనివాసులు తెలిపారు. ఈ ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ నేతలుగా జిల్లా జడ్జి గంట కవితా దేవి, సీఈఓగా కాంతమ్మ, మానోపాడు తహసీల్దార్ వాజిదా బేగం, గద్వాల ఎంపిడిఓ ఉమాదేవిలు వస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.ముగ్గుల పోటీలలోగెలుపొందిన వారికీ గద్వాల పట్టు చీరలు బహుకరిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. మహిళలు, విద్యార్థినులు ముగ్గుల పోటీలలో అధిక సంఖ్యలో పాల్గొనాలని చైర్మన్ తెలిపారు.

## పీఠాధిపతిని సన్మానించిన ఆంజనేయస్వాములు

**బిజినపల్లి, నవంబరు 18 ప్రభాతవార్త:** పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆవరణలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో మద్దిమడుగు పీఠాధిపతి శ్రీ జయరాం గురు స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జయరాం గురు స్వామిని ఆంజనేయ స్వామి మాల ధరించిన స్వాములు పూలమాలలతో సన్మానించారు. మద్దిమడుగు ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న ఆశ్రమం కోసం తిరుపతయ్య దంపతులు 5116 రూపాయలను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో కొండల్ గురుస్వామి, శివ, గురుస్వామి, తిరుపతయ్య స్వామి, యాదయ్యస్వామి, సురేషచారి స్వామి, నరేష్ స్వామి, శేఖర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్షలు

### అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు

**దేవరకద్ర, నవంబరు 18 ప్రభాతవార్త :** మండలంలో సోమవారం గ్రూప్ 3 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గం.ల నుంచి మధ్యాహ్న 12 గం.ల వరకు పేపర్ 1, మధ్యాహ్నం 3 నుంచి 5.30 వరకు పేపర్ 2 పరీక్షలు నిర్వహించారు. గత రెండు రోజులుగా దేవరకద్ర మండలం చౌదర్‌పల్లి సమీపంలోని స్వీట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పరీక్ష జరిగింది. దీనికి గాను ఎటువంటి ఆవాచనియ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బయోమెట్రిక్ అమలు చేసి గంట ముందుగానే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అధికారులు అనుమతించారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా అధికారులు తనిఖీ చేశారు.

## మెగా గ్యాస్ పైప్ లైన్ రోడ్డుకు దూరంగా జరిపి వేయండి

**బాలానగర్,నవంబరు 18 ప్రభాతవార్త:** బాలానగర్ మండల కేంద్రం మీదుగా బోడ జానంపేట టైల్స్ ఫ్యాక్టరీ కి వెళ్తున్న మెగా గ్యాస్ పైపులైను ఇంతకు ముందు ళి తీ రోడ్డును ఆనుకుని వేశారని, కానీ ఇప్పుడు బాలానగర్ నుంచి గంగాపూర్ వరకు డబుల్ రోడ్డు శాంక్షన్ అయినందున, ఈ గ్యాస్ పైప్ లైన్ రోడ్డు కిందకు వస్తుంది కాబట్టి ఆ పైపులైను తొలగించి, పక్కకు జరిపి వేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు కుమార్ నాయక్ కోరారు. ఇదే విషయమై బాలానగర్ తాహసిల్దార్‌కి, ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ళి తీ అధికారులు మెగా గ్యాస్ పైప్ లైన్ యాజమాన్యం ఇద్దరు సమన్వయంతో పైపులైన్ తొలగించి రోడ్డు పక్కగా వేసి ప్రజలకు భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## విద్యార్థులకు చదువులో అర్థమయ్యే రీతిలో బోధించాలి

**లింగాల, నవంబరు 18 ప్రభాతవార్త:** విద్యార్థులకు చదువులో అర్థమయ్యే రీతిలో బోధించాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ అన్నారు. సోమవారం మండలంలోని మానాజీపేట,రాంపూర్,వల్లభాపూర్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. న్యాస్ మోక్ పరీక్షల గురించి 3,4 తరగతుల విద్యార్థులకు తగు సలహాలు సూచనలు ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు బోధించాలని అందించాలని ప్రధానోపాధ్యాయులకు వంటఏజెన్సీ వారికి సూచించారు.అదేవిధంగా సమయపాలన పాటించాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాలకు సంబంధించిన అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, కుల గణన సర్వే సకాలంలో పూర్తి చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ సిఆర్పిలు పాల్గొన్నారు.

## అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దు

### విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యం: నారాయణపేట షి టీమ్ పోలీసులు బాలరాజు

**నారాయణపేట టౌన్, నవంబరు18 ప్రభాతవార్త :** అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని షీటీం పోలీసులు బాలరాజు అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని దయానంద విద్య మందిర్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాల గురించి, షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి, ర్యాగింగ్/ ఈవ్ టీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి, మరియు అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్ మరియు మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందని షి టీమ్ పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా షీ టీం పోలీసులు బాలరాజు మాట్లాడుతూ ఆడపిల్లలు, మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాంమని మహిళల భద్రత మా ముఖ్య బాద్యత. చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దు అన్నారు, ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అన్నారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని మరియు సామాజిక రుగ్మతల గురించి సెల్ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంత మంచిది సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉంది దానికి అలవాటు పడి బానిసలు కావద్దు విద్యార్థి దశ చాలా కీలకం కష్టపడే తత్వం, కష్టపడి చదువుకోవడం చాలా ముఖ్యమని మహిళలను, ఆడపిల్లలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మరియు అవహేళనగా మాట్లాడిన వెంటనే నారాయణపేట షీటీమ్ నెంబర్ 8712670398 నెంబర్ కు, లేదా డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా నూతన చట్టాల గురించి నూతన చట్టాలలో మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగిందనన్నారు. అవగాహన కల్పించిన వారిలో షి టీమ్ పోలీసులు, భరోసా సెంటర్ టీం సభ్యులు దేవి, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రూప్-3 పరీక్షల్లో నారాయణపేట,కొడంగల్ ఎత్తిపోతల పథకంపై ప్రశ్న రావడం హర్షించదగ్గ విషయం

**నారాయణపేట టౌన్, నవంబరు 18 ప్రభాతవార్త:** గ్రూప్ 3 పరీక్షల్లో నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంపై ప్రశ్న రావడం పట్ల సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా శాఖ, జిల్లా ప్రజలు హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా ఓ ప్రకటనలో వారు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల మనోభావాలు దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిర్వహించే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ 3 పరీక్ష పేపర్ త్రీ లో నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పై ప్రశ్న రావడం పట్ల ఈ ప్రాంత రైతులు మేధావులు ఉన్నత చదువుకున్న వారు ఈ ప్రాంతానికి నీరు ఎంత అవసరమో ఈ ప్రాంతంలో మొట్టమొదట రాష్ట్రంలో నీరు పారే కృష్ణానది నీరు పారుతున్న 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాయణపేటకు సాగునీరు తాగునీరు గత 70 సంవత్సరాల నుండి నిర్లక్ష్యానికి గురైన ప్రాంతం కాబట్టి తెలంగాణ ప్రాంతం అంతట పరీక్ష పేపర్లో అంశం రావడం పట్ల రైతులు భారతీయ కిసాన్ సంఘ్ నారాయణపేట జిల్లా శాఖ నీటి వనరులపై ప్రాధాన్యత ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి క్రైమ్ నవంబరు 18 ప్రభాతవార్త:** సోమవారం జరిగిన గ్రూప్3 పరీక్షల నిర్వాహణకు ఆయా కేంద్రాలను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పరిశీలించారు. పరీక్ష సరళిని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారని ఎస్పీ పేర్కొన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం పరీక్షల నిర్వహణను పూర్తిచేశమని తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంతో పాటు కొత్తకోట, వనపర్తి సమీపంలోని విద్య సంస్థల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా చూశామన్నారు. పరీక్షలు పూర్తి అయిన తర్వాత పరీక్షల నిర్వహణ అధికారుల సూచన మేరకు అవసరమైన సామాగ్రితో పాటు, జవాబు పత్రాలు స్ట్రాంగ్ రూముకు చేరే వరకు పోలీసు అధికారులు, ఇతర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పి సూచించారు.ఎలాంటి అవాంచీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరుగడానికి జిల్లా పోలీసు అధికారులు, సిబ్బం ది అప్రమత్తంగా ఉన్నందున ఎస్పీ అభినందించారు. ఎస్పీ తో పాటు వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, నరేష్, వనపర్తి సీఐ, క్రిష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాల వద్ద చిన్నారితో తండ్రుల జోలపాట



పరీక్షా కేంద్రాల వద్ద చిన్నారులతో తండ్రులు

**నారాయణపేట టౌన్,నవంబరు 18 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన రెండవ రోజు గ్రూప్3 పరీక్ష కేంద్రాలకు చిన్నారులతో పాటు భార్యాభర్తలు వచ్చారు. భార్య పరీక్ష వ్రాసేందుకు కేంద్రాల్లోకి వెళ్ళగా భర్తలు చిన్నారులతో బయట ఉన్నారు. ఏడ్చిన సమయంలో జోల పాటలతో జోకొడుతూ, మరి కొందరు పాలు పట్టిస్తూ,మరికొందరు అటు ఇటు తిరుగుతూ తల్లి జ్ఞాపకాలను మరిపించేందుకు తండ్రులు పడ్డా కష్టాలు ఎంతో ఎంతేంతో చెప్పా సాధ్యం కాదు. ఎంత మరిపించిన తల్లి ప్రేమకు సాటి ఏదియును రాదని తండ్రులు చెప్పుకొచ్చారు. చిన్నారుల పట్ల తండ్రులు పడుతున్న ఇబ్బందులు చూసిన కొందరికి ఆశ్చర్యానికి గురి చేసింది.

## స్వయం సహాయక సంఘాలలో ప్రతి మహిళను సభ్యులుగా చేర్పించాలి

### గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఏపీఎం పారిజాత

**గద్వాల నవంబరు 18 ప్రభాతవార్త:** ప్రతి మహిళ ను స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేర్పించాలని డిఆర్డి ఓ పిడి, అదనపు కలెక్టర్ నర్సింగరావు డ్వాక్రా సంఘాల సభ్యులను కోరారు.స్వయం సహాయక సంఘాలు సోమవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.మండల సమాఖ్య ప్రత్యేక సమావేశం తీర్మానం, మండల సమాఖ్య ప్రత్యేక సమావేశం లో చర్చించవలిసిన ఎజెండా అంశాలు, సంఘం లో లేని వారిని సంఘాలలో చేర్పించటం పై అదనపు కలెక్టర్ చర్చించారు. ఇందిర మహిళా శక్తి కార్యక్రమం,ఋణ బీమా పథకం,ప్రమాద భీమా పథకం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు,యూనిఫాంల తయారీ, డ్వాక్రా బజార్ ఏర్పాటు,బ్యాంకు లింకేజి కార్యక్రమం,వడ్డీలేని ఋణాలు,ఎంటర్ ప్రైజెస్ ఏర్పాటు, జిల్లా సమాఖ్య భవనాల నిర్మాణం తదితర అంశాలు గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో గద్వాల మండల సమాఖ్య కార్యదర్శి ఫరీదా, ఎపిఎం పారిజాత, సిసి లు రంగన్న, లక్ష్మి నారాయణ, మాధవి, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ భక్త కనకదాసు జయంతి వేడుకల్లో పాల్గొన్న గద్వాల ఎమ్మెల్యే



కనకదాసు జయంతి వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి

**గద్వాల నవంబరు 18 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం కె.టి దొడ్డి మండల పరిధిలోని చింతలకుంట గ్రామంలో శ్రీశ్రీశ్రీ భక్త కనకదాసు 537జయంతి సందర్భంగా అయన విగ్రహానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమెహన్ రెడ్డి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కురువ కులస్తుల కురువడోల్లతో ఎమ్మెల్యేకి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కి గ్రామస్తులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురువ కులస్తులందరికీ భక్త కనకదాసు జయంతి శుభాకాంక్షలు తెలిపారు. కర్ణాటక ప్రాంతంలో ఉడిపి ప్రసిద్ధి పుణ్యక్షేత్రంలో శ్రీకృష్ణుని దేవాలయంలో శ్రీకృష్ణుని దర్శించుకోవడానికి అవకాశం కల్పించేవారు కాదన్నారు. దేవాలయం వెనుక నుండి శ్రీకృష్ణుని భక్తిగా ప్రార్థించడం జరిగిందని ,కనకదాసు ఆయన భక్తికి మెచ్చి శ్రీకృష్ణుడు వెనుక తిరిగి కనకదాసుకు దర్శనం ఇవ్వడం జరిగినదన్నారు.కనకదాసు జయంతి సందర్భంగా గ్రామ, గ్రామాలలో పండగ వాతావరణం కనిపించింది. తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలలో అభ్యున్నతకు, అభివృద్ధికి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ కురవ హనుమంతు మాజీ, జెడ్పీటీసీ రాజశేఖర్, మాజీ ఎంపిపి విజయ్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, సింగిల్ విండో డైరెక్టర్ రఘు కుమార్ శెట్టి, నాయకులు చక్రధర్ రావు ఉరుకుందు, అజయ్ హరిప్రసాద్ గౌడ్,యుగంధర్ గౌడ్, విశ్వనాథ్‌రెడ్డి, ఖాజా, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్వరలో పియులో స్నాతకోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్

**మహబూబ్‌గర్ బ్యూరో నవంబరు 18 ప్రభాతవార్త:** పరిపాలన భవనంలో పర్మనెంట్ అధ్యాపకులతో వీసీ ఆచార్య శ్రీనివాస్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీసీ మాట్లాడుతూ, త్వరలో పియు లో స్నాతకోత్సవ కార్యక్రమం ఉంటుందని, అందుకు అందరూ సిద్ధంగా ఉండాలని, అదేవిధంగా విద్యా సంవత్సరం మొదలైనందున అకాడమిక్ క్యాలెండర్ అలమానాక్ పకడ్బందీగా అమలు చేయాలని, టీచింగ్ డైరీస్ అటెండెన్స్ రిజిస్టర్ లను నిరంతరం అప్డేట్ చెయ్యాలని, న్యాప్ టీం పియుకు వస్తున్నందున గత ఐదేళ్లలో జరిగిన పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో పొందుపరచాలని అన్నారు.కార్యక్రమంలో వీసీతో పాటు రిజిస్టర్ ఆచార్య చిన్నప్ప, ఓఎస్ డి మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజకుమార్, ప్రిన్సిపల్స్ డాక్టర్ నూర్జహాన్, డాక్టర్ చంద్ర కిరణ్ పాల్గొన్నారు.

## రోడ్లపై వరి ధాన్యం



రోడ్డుపై వరిధాన్యం ఆరబోసిన దృశ్యం

**చిన్న చింతకుంట, నవంబరు18 ప్రభాతవార్త:** రోడ్లపై వరి ధాన్యం ఆరబోయడం వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని మద్దూరు గ్రామం నుంచిఅల్లిపురం వరకు రోడ్లపై వరి ధాన్యం ఆరబోయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రైతులు తమ వరి ధాన్యాన్ని రోడ్లపై కాకుండా వారి పంట పొలాల్లోనే వరి ధాన్యాన్ని అరబోసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశాలు ఉన్న అట్టి ఆదేశాలను పట్టించుకోకుండా రోడ్లపైనే వరి ధాన్యం ఆరబోస్తున్నారు. దీనివల్ల రాత్రి వేళల్లో పలు ప్రమాదాలు జరిగి గాయాలు ఒక్కొక్కసారి ప్రాణ నష్టం కూడా జరిగే ప్రమాదాలు ఉన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై వరి ధాన్యం కుప్పలపై నల్ల కవరు కప్పి ఉంచడంతో రాత్రి వేళల్లో వానదారులకు వరికుప్ప కనిపించకపోవడంతో ప్రమాదం జరిగి గాయాలు పాలు కావడమే కాకుండా ప్రాణం నష్టం జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.ఇప్పటికైనా రైతులు రోడ్లపై వరి ధాన్యం ఆరబోయకుండా తమ వ్యవసాయ పొలాల్లోనే కల్లాలను ఏర్పాటు చేసుకొని దాన్యం ఆరబోసుకొని ప్రమాదాలు జరగకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా కనక దాస్ జయంతి వేడుకలు

**అయిజ నవంబరు18 ప్రభాతవార్త:** శ్రీశ్రీ భక్త కనక దాస్ జయంతి నీ పురస్కరించుకొని సోమవారం మండల కేంద్ర సమీపంలో కురుబ సంఘం నాయకులు కనకదాసు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు, కనక దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో కురుబ సంఘంనాయకులు, సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## గేదెలను కాపాడిన నాయకులు



బీమా ఫేస్2 సాగునీటి కాలువలో చిక్కుకున్న గేదెలను కాపాడిన నాయకులు

**కొత్తకోట నవంబరు18 ప్రభాతవార్త:** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని శివారులో గల అమడబాకుల బీమా ఫేస్2 సాగునీటి కాలువలో వడ్డేవాట గ్రామానికి చెందిన నాగమ్మకు చెందిన 7 గేదెలు నీరు త్రాగడానికి కాలువలోకి వెళ్లగా..అదే సమయంలో భీమా అధికారులు సాగునీరు వదలడంతో నీటి ప్రవాహంలో చిక్కుకున్న గేదెలు ప్రమాదవశాత్తు ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉండగా విషయం తెలుసుకున్న మాజీ జడ్పిటిసి పొగాకు విశ్వేశ్వర్, మున్సిపల్ కౌన్సిలర్ హుటల్ రాములు యాదవ్,బాలయ్య నాయుడులు కొత్తకోట ఫైర్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దేవేందర్ రెడ్డికి ,ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చి భీమా ఫేస్ 2 కాలువలో పడ్డ ఆ ఏడు గేదెలను బయటికి తీయించి పశుసంపదకు రక్షణ కల్పించారు.ఈ సందర్భంగా వడ్డేవాట గ్రామానికి చెందిన రైతు కుటుంబానికి చెందిన నాగమ్మ ఫైర్ స్టేషన్ అధికారి దేవేందర్ రెడ్డికి కొత్తకోట మాజీ జడ్పిటిసి పొగాకు విశ్వేశ్వర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి స్పందించిన తీరును అభినందించారు.

## అయిజ మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించండి

■ బిజెపి పట్టణ కార్యదర్శి భగత్‌రెడ్డి

**అయిజ నవంబరు18 ప్రభాతవార్త:** మున్సిపాలిటీలోని పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని బిజెపి పట్టణ కార్యదర్శి కంభంపాటి భగత్‌రెడ్డి పేర్కొన్నారు సోమవారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ మున్సిపాలిలో పెరిగిన జనాభా దృశ్య వార్డ్ లను పెంచాలని గత కమిషనర్‌కు విన్నవించడం జరిగిందికానీ ఇంతవరకు చేయలేదని అలాగే మున్సిపాలిటీలో పర్మినెంట్ కమిషనర్ లేకపోవడం, సమస్యలు అధికంగా ఉండటం ప్రధాన సమస్యగా మరిందన్నారు ప్రధానంగా భూ ప్రపంచంలో ఏ పక్షి కూడ వాలని చెట్టు ఏదైనా ఉందంటే అది కోనో కార్పాస్,మన జిల్లాలో ఉన్నటువంటి కలెక్టర్ సంతోష్‌ఆదేశాల మేరకు గద్వాలలో కోనో కార్పస్ చెట్లను తొలగించడం జరిగింది కానీ అయిజ మున్సిపాలిటీలో మాత్రం కోనో కార్పస్ చెట్లనుమాత్రం అలాగేఉన్నాయి.వాటిని వెంటనే తొలగించాలని కోరారు.అలాగే ప్లాస్టిక్ తిని మృతి చెందుతున్న మూగజీవాలు, మానవుని మనగడకు ప్రమాదం అని, గత మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి, ప్లాస్టిక్ ను నిషేధించమని కోరడమైనది, ఆవులు టీస్టాల్స్, హోటల్స్ దగ్గర ఉన్నటువంటి కప్పులు తిని ప్రమాదానికి గురవుతు న్నాయి, కావునస్వచ్ఛభారత్ కిందచెత్తబుట్టలను ఏర్పాటు చేసి, ఆవులను గోశాలకు తరలించాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు లక్ష్మాచారి, పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, వివిధ బూత్ అధ్యక్షులు గడిగ రఘు, భీమేష్, కే. భీమన్న పాల్గొన్నారు.



## తెలంగాణ నాటక సమాజ సమాఖ్య మండల అధ్యక్షుడిగా దర్గా శంకరయ్య

**కోయిలకొండ, నవంబరు 18 ప్రభాతవార్త:** తెలంగాణ నాటక సమాజ సమాఖ్య మండల స్థాయి రంగస్థలం నాటక మండల అధ్యక్షులుగా మండల కేంద్రానికి చెందిన కావలి దర్గా శంకరయ్యను ఆసంఘం సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సోమవారం మండల కేంద్రమైన కోయిలకొండలో తెలంగాణ నాటక సమాజ సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులంతా ఏకగ్రీవంగా కావలి దర్గా శంకరయ్యను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పారుపల్లి గ్రామానికిచెందిన కుమ్మరిసత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా సూరారం రఘుపతి,కే చెన్నయ్య, ఎం బాలయ్య, కోశాధికారిగా అంకిల్ల తోకలి రాములు, కావలి కృష్ణయ్య, ప్రచార కార్యదర్శులుగా, గౌరవ సలహాదారులుగా టీచర్ శంకరయ్య, రిటైర్డ్ టీచర్ నర్సింలు, ఎర్వా శ్రీను తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సమావేశం మాస్టర్ బి. కిషన్ బాబు ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడ్డ కావలిదర్గాశంకరయ్య మాట్లాడుతూ అంతరించి పోతున్న కలలకు జీవం పోసేందుకు మేమంతా కలిసి మా శక్తి మేరకు కృషి చేస్తామన్నారు. మండలంలో కళాకారులను తయారు చేసేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు.

## శివలింగాన్ని అపవిత్రం చేసిన యువకులు

**బాలానగర్, నవంబరు 18 ప్రభాతవార్త :** బాలానగర్ మండల పరిధిలోని మొదంపల్లి గ్రామంలో గల శ్రీ శివాంజనేయస్వామి ఆలయంలో శివలింగాన్ని గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు పక్కకు జరిపి అపవిత్రం చేశారని గ్రామస్తులు తెలిపారు. సోమవారం గ్రామస్తులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మొదంపల్లి గ్రామంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శనివారం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన సయ్యద్ ఖలీల్, పిట్టల లింగం అనే ఇద్దరు యువకులు బాగా మద్యం సేవించి ఆలయంలో శివలింగాన్ని పక్కకు జరిపారని తెలిపారు. అంతేకాకుండా మూత్ర విసర్జన చేసి ఆలయాన్ని అపవిత్రం చేశారని పేర్కొన్నారు.సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు గ్రామస్తులు తెలిపారు.ఈ ఘటనపై బీజేవైఎం మండల అధ్యక్షులు కుమార్‌నాయక్ మాట్లాడుతూ దేవాలయాలలో ఇలాంటి ఘటనలు జరగడం చాలా బాధాకరమైన విషయమని,పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయనడిమాండ్‌చేశారు. గ్రామ స్తుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిఇద్దరు వ్యక్తులను రిమాండ్ కి తరలించినట్లు రాజాపూర్ ఎస్సై రవి నాయక్ తెలిపారు.

## మహోన్నతుడు భక్త కనకదాసులు : మాజీ జడ్పి చైర్మన్ సరిత తిరుపతయ్య

**గద్వాల నవంబరు 18 ప్రభాతవార్త:** తన కీర్తనల ద్వారా సమాజంలోని అసమానతల్ని రూపుమాపేందుకు కనక దాసు ఎంతో కృషి చేసినట్లు మాజీ జడ్పి చైర్మన్ సరిత అన్నారు. కనకదాసుల వారి 537వ జయంతిని పురస్కరించుకొని సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న కురువ సంఘ కమీటీ స్థల ఆవరణలో కురువ సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత తిరుపతయ్య అన్నారు. మున్సిపల్ చైర్మన్ బి.ఎస్.కేశవ్‌హాజర్రై మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.. అనంతరం సరితమ్మ మాట్లాడుతూ ఈయన కన్నడలోనలచరిత్ర, హరిభక్తిసార, నృసింహస్తవ, రామధ్యాన చరిత్రే, మోహన తరంగిణి అనే రచనలు చేశారని,కనకదాసుల వారి అడుగుజాడల్లో ఇప్పటి యువత మార్గదర్శకంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు,నడిగడ్డ ప్రాంతంలోనే కాక తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 70 లక్షల మంది కురువలు ఉన్నారని,బడుగు బలహీన వర్గాలైన క్రింది జాతులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనకబడిన వారి అభివృద్ధి కోసం కృషి చేయడానికి గాను సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోతాన్నారు.అత్యధిక జనాభాగల కురువలు విద్యలో వెనుకబడిన్నారని,అభివృద్ధి చెందాలని సరితమ్మ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు,గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హన్మంతు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు,మధుసూదన్ బాబు,ఎల్లప్ప, కేశవులు,అతికూర్ రెహమాన్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, గోనుపాడు శ్రీనివాస్‌గౌడ్,కరాటే శ్రీహరి,అమరావాయి కృష్ణారెడ్డి, అల్వాల రాజశేఖరరెడ్డి,జమ్మిచేడు ఆలయ మాజీ చైర్మన్ సతీష్,కొటేష్ నాయుడు, పాతపాలెం ఆనంద్‌గౌడ్, సంకాపురం రాములు,పల్లయ్య,కిష్టన్న, పెదొడ్డి రామకృష్ణ, ఈశ్వర్, క్రాంతి,బోరుబండి వీరన్న,మనోజ్,డాక్టర్ విజయ్,కురువ శ్రీనివాసులు,మల్దకల్,గోపాల్ వర్మ,జయకృష్ణ, దౌలన్న,గంజి రాములు,జనార్ధన్,నాగరాజు తదితరులు ఉన్నారు.

## కరాటేలో మెడల్ సాధించిన విద్యార్థులకు అభినందనలు

**నారాయణపేట టౌన్, నవంబరు 18 ప్రభాతవార్త:** ఈనెల 17న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన ఇంటిర్ స్టేట్ ఓపెన్ కరాటే పోటీలు జరిగాయి. పోటీల్లో భాగంగా దామరగిద్ద గీతం పాఠశాల విద్యార్థులు పాల్గొని గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి పల్లవితో పాటు పాఠశాల సిబ్బంది అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోబాటు, ఇలాంటి రంగాల్లోను నైపుణ్యం కలిగి ఉండాలి అన్నారు. మునుముందు పాఠశాలనుండి మరింత ప్రోత్సాహం అందజేస్తామన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి కరెంట్ పోటీల్లో మెడల్ సాధించడానికి కృషిచేసిన కరాటే మాస్టర్ నరసింహరాజుకుపాఠశాలసిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

## మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో దేవరకద్ర ఎమ్మెల్యే

**దేవరకద్ర,నవంబరు 18 ప్రభాతవార్త:** మహారాష్ట్రలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో ఆదివారం రాత్రి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముంబై నగరంలోని మలాడ్ వేస్ట్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అస్లాంషేక్ తరఫున ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అక్కడి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కన్నయ్య కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచార సభలో కూడా దేవరకద్ర ఎమ్మెల్యే పాల్గొన్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

## అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ప్రశాంత్ రెడ్డి

**దేవరకద్ర,నవంబరు 18 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్‌లో సోమవారం జరిగిన అయ్యప్ప పడిపూజలో దేవరకద్ర బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. కోట్ల విజయకుమార్ బృందం ఆహ్వానం మేరకు కొండ ప్రశాంత్ రెడ్డి అక్కడికి వెళ్లి పూజలోపాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేపిఆర్ ఆర్ యువసేన నాయకులు రాజు, చంటి, మణిదీప్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మహాపడి పూజ

**భూత్పూర్, నవంబరు 18, ప్రభాతవార్త:** సోమవారం భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ శ్రీఅంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములు, భక్తులు అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమం ఎంతో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప శరణుఘోషతో ఆలయం మార్మోగింది. పూజా కార్యక్రమానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆగిరిరవి, మండల కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్ కుమార్‌గౌడ్‌తో పాటు నాయకులు హరియానాయక్, దెంది లక్ష్మీకాంత్‌రెడ్డి, పవన్, మాసగౌడ్, తమ్మన్నగౌడ్, శివరాములు, కోట్ల కిష్టయ్య ఇతర నాయకులు, అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## నామమాత్రంగా బీటీ రోడ్డు మరమ్మతు పనులు

**అమరచింత నవంబరు 18ప్రభాతవార్త :** అమరచింత మండల కేంద్రం నుండి కొంకనివానిపల్లి గ్రామంవరకు గతుకులమైన బీటీ రోడ్డుకు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. మరమ్మతు పనుల కోసం ప్రభుత్వం తొమ్మిది లక్షల రూపాయలు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ ఈ పనులను నామమాత్రంగా చేపడుతున్నారు. చేపట్టే పనులు పూర్తిగా నాసిరకంగా ఉన్నాయని పట్టణ ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతుల కోసం 9 లక్ష రూపాయలు కేటాయించగా అరకొర పనులు కేటాయించి కాంట్రాక్టర్ చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రభుత్వ ధన వృధా కాకుండా ఈ పనులను పర్యవేక్షించి సంబంధిత కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**పాన్‌గల్ నవంబరు 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కిష్టాపూర్ తండా కు చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు పిర్య నాయక్ కుమారుడు కిషోర్ నాయక్ రోడ్ ప్రమాదంలో రెండు రోజుల క్రితం మరణించగా సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సోమవారం కిష్టాపూర్ తండాలో కిషోర్ నాయక్ కుటుంబసభ్యులను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో కుటుంబానికి అన్ని విధాలుగా వెన్నంటి ఉంటామని తెలిపారు. ఆయనతోపాటు బిఆర్ఎస్ జిల్లా నాయకులు దూరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీశ్రీధర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ నాయక్, వీరసాగర్, కృష్ణ, చంద్రు నాయక్, తిలక్ గౌడ్, నవీన్ రెడ్డి,, రమేష్ నాయక్ ఉన్నారు.

## భారీ మొత్తంలో గుట్కాల డంప్ స్వాధీనం

**నారాయణపేట టౌన్, నవంబరు18 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యసాయి కాలనీకి చెందిన పూరి శ్రీధర్ నారాయణ శెట్టి రేకుల షెడ్డులో నమ్మదగిన సమాచారం మేరకు పెద్ద మొత్తంలో ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లను (విమల్, సాగర్) లను నిల్వ ఉంచినందున టాస్క్ ఫోర్స్, నారాయణపేట పోలీసులుసంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకొని విచారించగా అట్టి గుట్కా ప్యాకెట్ల విలువ 6,80,460/రూపాయలు ఉంటుందని అట్టి గుట్కా సంచులను పోలీస్ స్టేషన్కు తరలించి పూరి శ్రీధర్ పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పేట టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వం నిషేధించినటువంటి గుట్కా ప్యాకెట్లను ఎవరైనా అక్రమంగా నిల్వ ఉంచిన, ప్రజలకు అమ్మిన, రవాణా చేసినఅట్టి వ్యక్తులపైచట్ట ప్రకారంకఠిన చర్యలుతీసుకోవడం జరుగుతుందని ఎస్సై హెచ్చరించారు.

## ఛలో లగచర్లను విజయవంతం చేయాలి

**బిజినేపల్లి, నవంబరు 18 ప్రభాతవార్త:** లగచర్ల గిరిజన రైతులను పరామర్శించడానికి లంబాడి హక్కుల పోరాట సమితి ఈనెల 20న చలో లగచర్ల కార్యక్రమానికి నాగర్ కర్నూల్ జిల్లా కమిటీ అధ్యక్షులు ఆర్.కిషన్ నాయక్, ప్రధాన కార్యదర్శి ముడవత్ సిత్య నాయక్ ,రాష్ట్ర నాయకులు కె .మాన్యనాయక్, అంగోత్ లక్ష్మణ్ నాయక్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులసమావేశంలో సోమవారం మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూభూసేకరణ, పోలీసుల దాడుల్లో గాయపడ్డవారిని పరామర్శించేందుకే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దుద్యాల మండల పరిధిలోని రోటిబండ తండా, పులిచెర్లకుంట తండా, మైసమ్మగడ్డ తండా, గడ్డమీది తండా, ఈదులకుంట తండాలో తమబృందం సభ్యులు పర్యటించి బాధితులను పరామర్శిస్తారని చెప్పారు. గిరిజనులపై పెట్టిన కేసులను వెంటనే కొట్టి వేయాలని, రిమాండ్‌కు తరలించినగిరిజనులను వెంటనేవిడుదల చేయాలనిడిమాండ్ చేశారు. జిల్లానుండి పెద్ద సంఖ్యలోగిరిజనులు తరలివచ్చి చలోలగచర్లను విజయవంతం చేయాలి అని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**మూసాపేట, నవంబరు 18 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా ఐజ మండలం గుడిదొడ్డి గ్రామానికి చెందిన వడ్డే హనుమంతు భార్య వడ్డే భీమమ్మ ఇద్దరు మోటార్ సైకిల్ పై షాద్ నగర్ నుండి నుంచి సొంత గ్రామము ఐజాకు బైక్ వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో మూసాపేట మండలం జానంపేట దగ్గర రోడ్డుపై హైదరాబాద్ నుంచి కర్నూలు వెళుతున్న గుర్తుతెలియని వాహనం మోటార్ సైకిల్ ను ఢీ కొట్టింది. మోటార్ సైకిల్ పై ఉన్న వడ్డే భీమమ్మ (48) తలపై నుంచి ఆ వాహనం వెళ్లడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త వడ్డే హనుమంతుకు కూడా గాయాలయ్యాయి. ఘటన స్థలాన్ని చేరుకున్న స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసులు మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తామన్నారు.

## వైభవంగా అవధూత నరసింహస్వామి ఆరాధన మహోత్సవాలు

**నారాయణపేట టౌన్, నవంబరు 18 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణంలోని సుభాష్ రోడ్‌లో గల సద్గురు అవధూత నరసింహ స్వామి వారి 133వ ఆరాధన మహోత్సవాలను సోమవారం మఠం కమిటి సభ్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకడ హారతి, మహా రుద్రాభి షేకం, గణపతి, నవగ్రహ పూజ, గురు గాయత్రి యజ్ఞం, విష్ణుసహస్ర నామ మంగళ హారతి తో బాటు అన్నప్రాసద వితరణ గుజరాత్ కు చెందిన భరుచ్ మాత మరియు విజయవాడకు చెందినబాలఅవధూత ప్రకాశనంద సరస్వతిస్వామి ఊరేగింపునిర్వహించారు. ఈ కార్యక్రమంలో మఠంకమిటీసభ్యులుమహిళా భక్తులు, పట్టణప్రజలుపాల్గొనిస్వామి వారిని దర్శించుకున్నారు.

## టిఆర్ఎస్ గిరిజన నేతల అరెస్టు

**కోయిల్‌కొండ, నవంబరు 18 ప్రభాతవార్త:** లగచర్ల పరిసర ప్రాంతాల్లో పర్యటించేందుకు వస్తున్న జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ బృందం కల్వకుంట ఉండేందుకు ముందస్తుగా సోమవారం మండల టిఆర్ఎస్ పార్టీ గిరిజన నేతలను పోలీసులు అరెస్టు చేశారని మండల టిఆర్ఎస్ పార్టీ నేత గిరిజన నాయకుడు హరి సింగ్ తెలిపారు. మండలంలోని ఇటిక్యాల తండా గ్రామపంచాయతీ కి చెందిన మండల టిఆర్ఎస్ పార్టీ నాయకుడు, గిరిజన నేత హరి సింగ్ నాయక్ ను అరెస్టు చేశారు.

## సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

**ఉప్పునుంతల, నవంబరు 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆమలు చేస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకు తాలూకాలోని ప్రజలు సహకరించాలని ఎసిఎన్‌టియుసి తాలుక అధ్యక్షుడు మహమూద్ అలీ పేర్కొన్నారు. అచ్చంపేట పట్టణంలో ఎమ్మెల్యేరెడ్డుకు తోడ్పాటును అందిస్తూ కుటుంబ సర్వే విజయవంతంగా సాగేందుకు కృషి చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి సర్వేకు సహకరిస్తూ సర్వే విజయవంతంగా పూర్తి అయ్యేలా తాలుకలోని అన్ని మండలాల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. పట్టణంలో సర్వేను విజయవంతంగా ముగిసేందుకు ఎ సిపిఎ కృషి చేస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు పార్టీ కార్యకర్తలు కుటుంబ సర్వేను విజయవంతంగా సాగించేందుకు కృషి చేయాలని కోరారు.

## విద్యార్థులకు ఐడెంటిటీ కార్డుల పంపిణీ

**కృష్ణ, నవంబరు18 ప్రభాతవార్త:** ముడుమల్‌లో సోమవారం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శేఖర్ సమక్షంలో దాదాపు 200 మంది విద్యార్థులకు ఫోటో ఐడెంటిటీ కార్డులను పంపిణీ చేయడం జరిగింది. విద్యార్థులంతా పాఠశాల యూనిఫాంతో బాటు టై, బెల్ట్, బ్యాడ్జ్, ఐడెంటిటీ కార్డులనుధరించి ప్రతి రోజూ బడికి హాజరు కావాలని ప్రధానోపాధ్యాయుడు శేఖర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి, రవికుమార్, ఆస్మా నిషాత్, విద్యావాలంటీర్ శ్రావణి, పాఠశాల సర్వీస్ పర్సన్ సోఫీ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి

**వనపర్తి టౌన్ నవంబరు 18 ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ కార్మికులకు గత మూడు నాలుగు నెలల నుండి జీతాలు బకాయిలు ఉన్నాయని పెండింగ్ జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓ భాను ప్రకాష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నాలుగు నెలలు జీతాలు బకాయిలు ఉన్నాయని, పండుగకు కూడా జీతాలు రాలేదని ప్రశ్నించారు. తక్షణం జీతాలు పైగా నెలల తరబడి జీతాలు బకాయి ఉండడంతో కార్మికులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వచ్చే దసరా లోపల జీతాలు చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేసి బట్టల సబ్బులు నూనెలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పెట్టిన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని జీతాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు పని భారం వేధింపులు ఆపాలని, ప్రమాదంలో చనిపోయిన కార్మికుల వారి కుటుంబంలో ఉద్యోగం ఇచ్చి 25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. జీఓ 51 సవరించాలని వారంతపు సెలవులు పండుగ సెలవులు ఇవ్వాలని, పిఎఫ్ ఇఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, నాయకులు నందిమల్ల రాములు, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కోశాధికారి పుష్ప, శీను, దాసు, రామచంద్రయ్య, గంగా, నరసింహ, భద్రయ్య, జమ్ములు, సుగ్రీవుడు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి

### -ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కోడి పిల్లల మదర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**వెల్దండ, నవంబరు18 ప్రభాతవార్త:** మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో సోమవారం సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా మహిళా సంఘ సభ్యులు ఆర్థికంగా స్వశక్తితో ఎదిగేందుకు వివిధ కార్యక్రమాలను చేపట్టనుంది. అందులో భాగంగానే రూ.2లక్షల 91,000 రూపాయలతో మంజూరైన కోడి పిల్లల మదర్ యూనిట్‌ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించి రాచూరు గ్రామ ఐక్యసహకార సంఘంలోని దుబ్బ భారతమ్మ నిర్మలకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు స్వశక్తితో ఎదిగేందుకు ప్రభుత్వం వివిధ వినూత్నమైన కార్యక్రమాలను చేపడుతుందని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొనిఆర్థికంగా ఎదగాలనిఅన్నారు. కార్యక్రమంలో డిపిఎం సుధాకర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ ఠాగూర్ బాలాజీసింగ్, తహసిల్దార్ కార్తీక్‌కుమార్, మాజీ సర్పంచ్ యన్నం భూపతిరెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్, నాయకులు పర్వత్‌రెడ్డి. మట్ట వెంకటయ్య గౌడ్, రషీద్, అలీ, తలారినరసింహ, రమేష్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షు రాలుభారతమ్మ, ఏపీఎం రాములునాయక్, సీసీ యాదయ్య, గెలవమ్మతో పాటు తదితరులు ఉన్నారు.

# రైతులు దళారీలను నమ్మి మోసపోవద్దు

### ◆ డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిసిసిబి చైర్మన్

**వీపనగండ్ల నవంబరు18 ప్రభాతవార్త:** రైతులు దళారీలను నమ్మి మోస పోవద్దని ప్రభుత్వం ఏర్పాటుచేసిన మహిళా సంఘాలు ఏర్పాటుచేసినవరి కొనుగోలు కేంద్రాలలోని ధాన్యాన్ని అమ్ముకోవాలని అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు ఇస్తున్న 500 బోనస్ రూపాయలను రైతుల వారి ఖాతాలో వేయడం జరుగుతుంది అని డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు సోమవారం నాడు పుల్గర్ జర్ల, గోపాల్దిన్నె గ్రామాలలో, పానగల్ సింగల్ విండో ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ రైతు మండల సమన్వయ అధ్యక్షుడు నారాయణరెడ్డి రైతు బంధు మాజీ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య తో కలిసి ఆయన మాట్లాడారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చడం జరిగిందని వారు ఈ సందర్భంగా తెలిపారు. అయితే రైతులు వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలని దళారులను నమ్ముకుంటే మోసపోవాల్సిన అవసరం ఏర్పడుతుందని వారు తెలిపారు .అయితే ప్రభుత్వాన్ని నిబంధనల ప్రకారం లావు వరి ధాన్యానికి 17శాతం సన్న వరి ధాన్యానికి 14 శాతం తేమశాతం ఉండాలని ఆ రకంగా రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టి తూకం చేయించుకోవాలని వారు రైతులకు సూచించారు. అదేవిధంగా వరి ధాన్యాన్ని తూకం చేసిన వెంటనేరైతులకు రసీదులు ఇవ్వాలని వారు మహిళా సంఘాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాల్దిన్నె గ్రామానికి చెందిన బాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ వర్కర్స్ పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**వనపర్తి టౌన్ నవంబరు18 ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ వర్కర్స్ పెండింగ్ వేతనాలు ఇవ్వాలని. టియుసిఐ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ రెవెన్యూకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా కోశాధికారి సి రాజు మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో వివిధ మండల కేంద్రాలు, గ్రామాలలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ వర్కర్స్ ప్రభుత్వం తలపెట్టిన ప్రతి స్పెషల్ కార్యక్రమాలను ముందు వరుసలో ఉండి విజయవంతం చేయడంలో కార్మికులు పనిచేస్తున్నార న్నారు. గ్రామపంచాయతీ వర్కర్స్ కు గత మూడు నాలుగు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ తెలిపారు. గ్రామాలకు సరైన సమయంలో వేతనాలు రావడం లేదనీ జీతాలు సకాలంలో చెల్లించాలని గ్రామ కార్యదర్శులని అడిగితే చెక్కులు రాసి పంపినామురాకపోతే మా బాధ్యత కాదనీ అనడం సరికాదని అన్నారు. మీరు పని చేస్తే చేయండి లేకపోతే లేదు అని కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారనీ, ఎంపీడీవోలను అనేకసార్లు కలిసిన ఫలితం లేదనీ, కావున జిల్లా అధికారులు వెంటనే స్పందించి పెండింగ్ వేతనాలను చెల్లించాలన్నారు. కార్మికులు పని ప్రదేశాలలో రక్షణ కోసం వాళ్లకు శానిటేషన్ సామాగ్రి వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణప్రగతి గ్రామపంచాయతీ వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు గోవిందమ్మ, జిల్లానాయకులుపెంటయ్య, గంగమ్మ, కురుమయ్య పాల్గొన్నారు.

# మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమాఖ్య అధ్యక్షురాలు పద్మమ్మ

**ఇటిక్యాల, నవంబరు18 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళా సంఘాల సభ్యులు పొంది ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఏపీఎం కురుమన్న మహిళా సమాఖ్య సభ్యులకు సూచించారు. సోమవారం కార్యాలయంలో ఇందిరా మహిళ శక్తి సంబరాలలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలం మహిళా సమాఖ్య ప్రత్యేక ఈసీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంఘంలో లేని వారిని చేర్చుకోవాలని సంఘంలో ఉన్న ప్రతి సభ్యురాలు కి రుణ బీమా పథకం. లోన్ బీమా. ప్రమాద బీమా. పొందే విధానం పై చర్చించారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయడం జరిగిందని. 154 సంఘాలకు రెండో విడత వడ్డీ లేని రుణాలు రావడం జరిగిందని వాటిని చిన్న సంఘం పొదుపు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులయూనిఫామ్ తయారీని మహిళా సంఘాలకు అప్పగించగా పాఠశాలలు ప్రారంభించాక విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగిందని అలాగే అర్హత గల మహిళ సభ్యులకు బ్యాంకు ఇప్పించడం జరుగుతుందని ఏపిఎం కురుమన్న ఈసీ సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు పద్మమ్మ, సీసీలు, వివో ఏలు గ్రామ సంఘం మహిళా అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బీమాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా సాధికారత అధికారులు

**పెబ్బేర్ నవంబరు18 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ఇండియాలో సోమవారం రోజు బ్యాంకు ఖాతాదారులకు ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనపై అవగాహన సదస్సు భీమా పథకాలపై అవగాహన మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ శ్రీవాణి, సలోమీలుమహిళా శిశుసంక్షేమ శాఖ అధికారిని ఆదేశాల మేరకు పెబ్బేరు పట్టణంలోని ఎస్బిఐ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం జనరల్ స్పెషలిస్ట్ శ్రీవాణి మాట్లాడుతూ ప్రజలకు జీవిత భీమా, ప్రమాద భీమా పథకాల గురించి అవగాహన కల్పిస్తూ ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన వార్షిక ప్రీమియం కేవలం 20 రూపాయలకే రెండు లక్షలరూపాయల ప్రమాద భీమా లభిస్తుందని 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వయసుగల బ్యాంకు ఖాతాదారులకు, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన వార్షిక ప్రీమియం 436 రూపాయలకే రెండు లక్షల రూపాయల జీవిత భీమా లభిస్తుందని ఇందులో 18సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల వయసు గలబ్యాంకు ఖాతాదారులకు ఈ పథకంలో అవకాశం ఉంటుందని తెలియజేయడం జరిగింది. మీ తర్వాత మీ కుటుంబ సభ్యులకు ఈ ప్రీమియం సంబంధించిన భీమా సొమ్ము చెందుతుందిఅని అవగాహన కల్పిస్తూ మహిళల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా శక్తి పథకాలను అమల్లోకి తీసుకురావడం జరిగింది. కాబట్టి ప్రతి ఒక్కరు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేస్తూ మహిళలు ఏ సమయంలోనైనా ఇబ్బందుల్లో ఉన్నట్టయితే 181 హెల్ప్ లైన్ నెంబర్ కి కాల్ చేసి సహాయం పొందవచ్చని, అదేవిధంగా వయోవృద్ధులు కుటుంబసభ్యుల వలన, ఇతరుల వలన సమస్యలు ఎదుర్కొంటున్న సమస్యలకు 14567 హెల్ప్ లైన్ నెంబర్‌కి కాల్‌చేసి సహాయంపొందవచ్చని అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో బ్యాంకు మేనేజర్ శ్రావణ్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్, మున్సిపల్ ఎంపీసీరాధా, మున్సిపల్ సంఘాల అధ్యక్షురాలు జ్యోతి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం



ఖోఖో టీంతో బిఆర్ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి

**మక్తల్, నవంబరు 18 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని కర్ని గ్రామంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర బాలబాలికల ఖో ఖో జట్ల శిక్షణ శిబిరాన్ని సోమవారం బిఆర్ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామమైన కర్ని లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న జట్టుకు దాదాపు 15 రోజుల పాటు శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం గర్వకారణమన్నారు. క్రీడాకారులకు వ్యక్తిగతంగా, పార్టీ పరంగా ఎప్పటికీ తన వంతు సహకారం అందిస్తానని ఆయన అన్నారు. రాష్ట్ర ఖో ఖో అకాడమీ కోచులు రంజిత్, సతీష్ మాట్లాడుతూ.. ఈ శిక్షణా శిబిరంలో జాతీయస్థాయి 20మంది బాలికలు, 20 మందిబాలురు మెరుగైన శిక్షణ పొందుతున్నారని, వీరు ఈనెల 25 నుండి 29 వరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్ లో జరుగు జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని, శిబిరానికి ఖర్చు దాదాపు రెండు లక్షల 50 వేలు ఖర్చు అవుతుందని దాతలు ముందుకొచ్చి ఆర్థిక సహకారాన్ని అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జెహెచ్ఎం వెంకటయ్య గౌడ్, డివైస్ఓ వెంకటేష్ శెట్టి, విశ్రాంత పిఈటి బి.గోపాలం, పిడి బి. రూప, మాజీ ఎంపీటీసీ మారుతి గౌడ్, నాయకులు వసంత గౌడ్, వెంకట్రాములు గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, వాకిటిప్రసాద్, నరసింహులు నాయుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

**వనపర్తి ప్రతినిధి నవంబరు18 ప్రభాతవార్త:** గత రెండు రోజులుగా కొనసాగిన గ్రూప్ 3 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం నిర్వహించిన గ్రూప్3, పేపర్ 3 పరీక్ష కోసం మొత్తం 8312మంది అభ్యర్థులు జిల్లాలో పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 4565 మంది మాత్రమే హాజరయ్యారని గ్రూప్ 3 పరీక్షల రీజనల్ కోఆర్డినేటర్ రామ్ నరేష్‌యాదవ్ తెలిపారు. మరో 3747 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరు అయినట్లు పేర్కొన్నారు. ఫోటోరైటప్

## కులగణన సర్వేను పరిశీలించిన అధికారులు

**దేవరకద్ర, నవంబరు18 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం బస్వాయపల్లిలో సోమవారం జరిగిన కులగణన సర్వేను మండల అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహకులను అధికారులు అన్ని వివరాలు అగిడితెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో తమశీల్దార్ కృష్ణయ్య, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.1913 ధర పలికిన హంస

**దేవరకద్ర, నవంబరు 18 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డుకు సోమవారం రైతులు 52 కింటాళ్ళ హంస ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు. వీటికిఅత్యధికంగా కింటాల్‌కు రూ.1913 ధర పలికింది. అతి తక్కువగా రూ.1889 ధర పలికింది. అలాగే 1570 కింటాళ్ళ ఆర్ఎన్ఆర్ ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాల్ ధాన్యానికి రూ.2469 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.1901 ధర పలికింది. అలాగే 5 కింటాళ్ళపత్తిని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి కింటాల్‌కు అత్యధికంగా రూ.5789 ధర పలికింది. అలాగే అతితక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## నేడు స్విట్స్ కళాశాలలో మెగా జాబ్‌మేళ

**దేవరకద్ర. నవంబరు18 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం చౌదర్‌పల్లి స్విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మెగా జాబ మేళ నిర్వహిస్తున్నట్లు కళాశాల డీన్‌డాక్టర్ కే.సుధాకర్, ప్రిన్స్‌పాల్ పి.సుధాకర్ సోమవారం తెలిపారు. రిలయన్స్ మరియు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్‌ల సంయుక్త అధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ మెగా జాబ్‌మేళాను కళాశాలవిధ్యార్థులు సద్వినియోగంచేసుకోవాలని వారు సూచించారు. ఈ మెగా జాబ్‌మేళాలో దాదాపు 10 కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 వరకు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. దీనికి కృషి చేసిన శ్రీనును కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ మాస్టర్ ట్రైనింగ్ అధికారి మొహ్మద్‌తౌసిన్‌బరి విధ్యార్థులకు శిక్షణ తరగతులను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం కన్వీనర్‌బి.శ్వేత, జయంతి ఎడ్యూకేషన్ సొసైటి అధ్యక్షుడు బాలీశ్వర్, ఉపాధ్యక్షుడులక్ష్మీకాంత్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 21న స్వామివారి అలంకరణ తొలగింపు

**చిన్నచింతకుంట, నవంబరు 18 ప్రభాతవార్త:** శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలలో స్వామివారి అలంకరణ సోమవారం తీయాల్సి ఉండగా భక్తులు, జాతరలోని వ్యాపారస్తుల వినతి మేరకు దేవస్థాన పాలక మండలి తీర్మానం మేరకు ఈనెల 21న స్వామివారి ఆభరణాలను తొలగింపును పొడిగించినట్లుఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డిలు తెలిపారు.

## బాధితులకు పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

**పెబ్బేరు నవంబరు18 ప్రభాతవార్త:** సోమవారం పెబ్బేర్ పోలీస్ స్టేషన్ లో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సిఈఐ ఆర్ పోర్టల్ ద్వారా కంప్లైంట్ చేసి పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి బాధితులు గుమ్మడం తండా గ్రామానికి చెందిన తులసి ,పెబ్బేర్ టౌన్ కు చెందిన ఎండి సలీం తమ తమ ఫోన్లను పోగొట్టుకోనీ పెబ్బేరు పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేయగా తమ ఫోన్లను కనిపెట్టి వారి వారి ఫోన్లను అప్పగించడం జరిగింది. ఫోన్లు తిరిగి ఇచ్చినందుకు పోలీసులకు బాధితులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెబ్బేర్ ఎస్సై హరిప్రసాద్ రెడ్డి కానిస్టేబుల్ సురేష్ పాల్గొన్నారు.

## 21న దివ్యాంగులకు ఆటల పోటీలు

**వనపర్తి టౌన్ నవంబరు18 ప్రభాతవార్త:** దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 21వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారిని లక్ష్మమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఆట పోటీలను కలెక్టర్ ఆదర్శ సురభి హాజరై ప్రారంభిస్తారన్నారు. పరుగు పందెం, షార్ట్ పుట్ ,క్యారమ్స్, చెస్ తదితర ఆటల పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. దివ్యాంగులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## పీజెపి ఎస్ఈగా ఎండి రహీముద్దీన్‌కు పదోన్నతి

**గద్వాల నవంబరు 18 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో ఇరిగేషన్ శాఖలో పీజెపి ఈఈగా ఉన్న ఎండి రహిముద్దీన్ కు ఎస్ఈ గా పదోన్నతి వచ్చింది. సోమవారం అదే డిపార్ట్మెంట్లో ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలుఆయనకు శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## సదర్ సమ్మేళన నిర్వహణ కమిటీ ఎంపిక

**నారాయణపేట టౌన్, నవంబరు 18 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 25న జరిగే సదర్ ఉత్సవాల కోసం యాదవ మహాసభ ఆధ్వర్యంలో స్థానిక సిటిజన్స్ క్లబ్ లో సోమవారం ఉత్సవ కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడుగా గొల్ల బాలప్ప, కన్వీనర్ గా రఘువీర్ యాదవ్ కోశాధికారిగా గోపాల్ యాదవ్ , ఉప కోశాధికారిగా చెన్నప్ప యాదవ్ , కో కన్వీనర్లుగా కె.తిరుపతి యాదవ్, గొల్లకృష్ణయ్య యాదవ్, పీరంపల్లి శ్రీనివాస్ యాదవ్, జాయింట్ కన్వీన ర్లుగా అంజి యాదవ్ ,మన్నే బస్వరాజ్ యాదవ్, చెన్నకేశవులు యాదవ్, కార్యనిర్వాహక సభ్యులుగా శశికాంత్‌యాదవ్, జి.చిన్నయ్య యాదవ్‌లతో పాటు జిల్లాలోని అన్ని మండలాల యాదవ మహా సభ మండల అధ్యక్షులతో కలిసి మండలా నికి ఇద్దరి చొప్పున సభ్యులు గా ఎన్నుకున్నారు. సదర్ సమ్మేళన నిర్వహణ కమిటీ అధ్యక్షున్ని సన్మానించారు.

## విశ్రాంత డీఈఓ విజయ్‌కుమార్‌ను సన్మానం

**భూత్పూర్, నవంబరు18, ప్రభాతవార్త:** విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి శివార్చక విజయ్‌కుమార్‌ను సోమవారం భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గాంధీజీ ఆశయాల మేరకు సామాజిక మార్పు కోసం విజయ్‌కుమార్ గాంధీ జయంతి రోజున అలంపూర్ జోగుళాంబ సన్నిధి నుంచి బాపు బాటలో సత్యశోధన యాత్ర పేరిట పాదయాత్ర చేపట్టారు. వందరోజుల్లో వెయ్యి కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహిస్తూ జనవరి 12ననాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం ఉమామహేశ్వరం ముగిస్తారు. ఈ సందర్భంగా పాదయాత్రలో భాగంగా సోమవారం భూత్పూర్‌కు చేరుకున్న విజయ్‌కుమార్ భూత్పూర్ చౌరస్తాలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భూత్పూర్‌కు చేరుకున్న విజయ్‌కుమర్‌ను మున్సిపల్ చైర్మన్‌తో పాటు పలు పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలుకుతూ పాదయాత్రకు మద్దతు తెలిపారు. స్వాగతం పలికిన వారిలో బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, మొహ్మద్ సాధిక్, పులగుర్ల మల్లేష్, సత్తూర్ తిరుపతయ్యగౌడ్, మండి ఆటో వెంకటయ్య, మాతరి రాముతో పాటు కాంగ్రెస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌కుమార్‌గౌడ్ నాయకులు అబుబాకర్ సిద్ధిఖీ, సంజీవరెడ్డి, ఆనంద్‌లతో పాటు ఉపాధ్యాయులు సత్తూర్ బాల్‌రాజ్‌గౌడ్, సిఎన్ఆర్ తదితరులున్నారు.